RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| మల్కాజ్‌గిరి | సంపుటి : 3 | సంచిక : 117 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | మంగళవారం,అక్టోబర్,28, 2025 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 117 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Tuesday,October,28,2025 | PAGES : 8 RS : 4 /- |


## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం
# టఫ్ ఫైట్ లో గెలిచేది ఎవరు..?



**హైదరాబాద్,అక్టోబర్,27,తెలంగాణ దిశ:** జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక ప్రచారం హోరాహోరీగా సాగుతుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అన్ని రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారడం తో ప్రధాన పార్టీల నేతలు నువ్వా నేనా అన్నట్టు ఎన్నికల ప్రచారాన్ని సాగిస్తున్నారు. ప్రధానపార్టీలు- కాంగ్రెస్, పార్టీల అభ్యర్థుల తరపున ఆయా పార్టీల నాయకులు నియోయజక వర్గంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు..

**ప్రచారం వేగవంతం చేసేలా ప్లాన్ చేసిన కాంగ్రెస్**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నేపథ్యంలో కాంగ్రెస్ యూసఫ్ గూడా డివిజన్ ముఖ్యనాయకుల సమావేశాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించారు. ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, పలువురు శాసనసభ్యులు డివిజన్ ప్రెసిడెంట్ ఫిరోజ్ ఖాన్ సహా పలువురు హాజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారాన్ని వేగవంతం చేసేలా కార్యాచరణ ను చర్చించినట్లు పొన్నం ప్రభాకర్ చెప్పారు.

**కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో సీతక్క**

కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించాలని,స్థానికకార్యకర్తల్లో ఉత్సాహం నింపాలనీ చర్చించినట్లు, పోలింగ్ శాతం పెంచేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.కాగా ఈ ఉదయం మంత్రి సీతక్క నగరంలోని కృష్ణ కాంత్ పార్కులో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేశారు. స్థానిక వీధి వ్యాపారులతో ముచ్చటించారు.

**జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికకు బీజేపీ సమావేశం**

ఇలా ఉండగా, రాష్ట్ర కార్యాలయంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల శక్తి కేంద్రఇంచార్జిల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాం చందర్ రావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పాల్గొన్నారు. .

## జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి
# రేవంత్.. మంత్రి పొన్నం



**హైదరాబాద్,అక్టోబర్,27,తెలంగాణ దిశ:** జూబ్లీహిల్స్ లో మూడు ప్రధాన పార్టీలు దూకుడు పెంచాయి. ఎన్నికలు సమీపిస్తుం డటంతో ప్రచారంలో వేగం పెంచాయి. నామినేషన్లవిత్‌డ్రా ప్రక్రియ ముగియడంతో 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఈసీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇటీవల ఎన్నికల గుర్తులను కూడా కేటాయించింది. దీంతో అభ్యర్థులంతా ప్రచార పర్వాన్ని పరుగులు పెట్టించేయత్నాల్లో మునిగిపోయారు. అయితే సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్?, అధికార కాంగ్రెస్, బీజేపీ.. ఇలా మూడు పార్టీలు ఫుల్ ఫోకస్ పెట్టాయి. అయితే అధికార కాంగ్రెస్‌కు ఇది ప్రతిష్టాత్మకమైన ఎన్నిక కావడంతో స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి బరిలోకి దిగబోతున్నారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేయబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.



## కేటీఆర్ నా స్థాయికి
# తగిన వ్యక్తి కాదు..
### - మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి


**హైదరాబాద్,అక్టోబర్,27,తెలంగాణ దిశ:** కేటీఆర్ తన స్థాయికి తగిన వ్యక్తి కాదని, బీఆర్ఎస్ పార్టీ ఐదు ముక్కలు అవుతుందని రహదారులు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ వద్ద మీడియాతో మాట్లాడారు. తాను మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు కేటీఆర్ గుంటూరులో చదువుతున్నాడని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అయిదు ముక్కలు అవుతుందని, బీఆర్ఎస్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడిగా కేసీఆర్ ఉంటారన్నారు. బీఆర్ఎస్ హెచ్, బీఆర్ఎస్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎస్, బీఆర్ఎస్ హిమాన్షు, కవిత ఏమి పెట్టుకుంటుందో తెలియదని చెప్పారు. కవిత నే హరీష్ రావు ,సంతోష్ రావు కాళేశ్వరం పేరు తోదోచుకున్నారు అని.. రామన్న జాగ్రత్త అంటు మాట్లాడిందని చెప్పారు. పేదోళ్లకు ఒక రోజు కూడా సన్నబియ్యం పెట్టాలనే ఆలోచన లేని కేటీఆర్ గురించి మాట్లాడటం అవసరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..దొంగే దొంగ అన్నట్లుగా మాట్లాడుతున్నారు కాబట్టి తాము వాళ్ళ మీద కేసు పెట్టామన్నారు.. 2023 ప్రజలు కేసీఆర్‌ను ఫామ్ హౌస్ తరలించారని, ఎంపీ ఎన్నికలు సున్నా ఇచ్చి చెంప చెల్లు మనిపించారని చెప్పారు. కంటోమెంట్ ఎన్నికల్లో గువ్వగయ్యమనిపించారని, ఇప్పుడు జూబ్లీ హిల్స్‌లో కూడా బీఆర్ఎస్ ను ఇంటికే పరిమితం చేస్తారని చెప్పారు. ప్రజా సంక్షేమం తమకు ముఖ్యమని, ప్రజల సమస్యల మీద రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు.

# కనీసం చలనం లేదా..?
## వీధి కుక్కల అంశంలో రాష్ట్రాలపై సుప్రీం ఆగ్రహం..



**న్యూఢిల్లీ,అక్టోబర్,27:** వీధి కుక్కల నియంత్రణకు తాము ఆదేశాలు ఇచ్చి రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకు స్పందించలేదంటూ ఆయా రాష్ట్రాల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఉత్తర్వులను అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయ్యారని, తద్వారా అంతర్జాతీయ స్థాయిలో దేశం పరువు తీశారంటూ సర్వోన్నత న్యాయస్థాన మండిపడింది. తమ ఆదేశాల తర్వాత కూడా దేశవ్యాప్తంగా వీధి కుక్కల దాడుల ఘటనలు నమోదు అవుతూనే ఉన్నాయని, వీధి కుక్కల దాడులపై రోజూ మీడియాలో వార్తలు వస్తున్నా.. చలనం లేదా అని ప్రశ్నించింది. తమ ఆదేశాల మేరకు అఫిడవిట్లు దాఖలు చేయడంలో విఫలం అయినందుకు పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మినహా మిగతా అన్ని రాష్ట్రాల సీఎస్?లంతా నవంబర్ 3న జరగబోయే తదుపరి విచారణలో స్వయంగా హాజరై ఇన్ని రోజులు కౌంటర్ ఎందుకు దాఖలు చేయలేదో వివరణ ఇవ్వాలని జస్టిస్ విక్రమ్ నాథ్ నేతృత్వంలోని జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్వీ అంజరియాలతో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల ప్రత్యేక ధర్మాసనం పేర్కొంది. లేకుంటే ఫెనాల్టితోపాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ మాత్రమే తమ అఫిడవిట్లు దాఖలు చేశాయని అయితే దీపావళి సెలవుల్లో కౌంటర్ దాఖలు చేసినందున అవి తమ రికార్డులో లేవని ధర్మాసనం పేర్కొంది. వీధికుక్కల సమస్యకు సంబంధించిన సుమోటో కేసులో గత ఆగస్టులో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వీధి కుక్కల నియంత్రణ విషయంలో వాటిని పట్టుకుని శస్త్రచికిత్సచేసి తిరిగి వదిలే విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ అఫిడవిట్లు దాఖలు చేయాలని సూచించింది. కానీ రాష్ట్రాలు ఇప్పటి వరకు స్పందించలేదు.

## వాటాలపై ఉన్న శ్రద్ధ
# ఆటోడ్రైవర్లపై లేదా..?



### - రేవంత్‌ను నిలదీసిన హరీశ్

**హైదరాబాద్,అక్టోబర్,27,తెలంగాణ దిశ:** బీఆర్ఎస్ మాజీమంత్రి హరీష్ రావు సోమవారం ఎర్రగడ్డలో పర్యటించారు. అక్కడ ఆటోడ్రైవర్లతో మాట్లాడిన ఆయన.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎర్రగడ్డ నుంచి తెలంగాణ భవన్‌వరకూ ఆయన ఆటోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో ఆటో డ్రైవర్ల పరిస్థితి అధ్వాన్నంగా తయారైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 161 మంది ఆటోడ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని, ఆ కుటుంబాలన్నీ ఇప్పుడు రోడ్డుమీద పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన ఆటో కార్మికుల ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అలాగే ఆటో కార్మికులంతా ధైర్యంగా, ఓర్పుగా ఉండాలని, ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని కోరారు. తెలంగాణ భవన్ వరకూ రమేష్ గౌడ్ అనే వ్యక్తి ఆటోలో వచ్చానని, ఆటో తోలుతూ తన కొడుకు స్కూల్ ఫీజు కట్టలేకపోతున్నానని, ఇంటి అద్దె, ఖర్చులు, ఆటో ఫైనాన్స్ అన్ని ఖర్చులు ఎక్కువైపోతున్నాయని అతను వాపోయాడన్నారు. రూ.5 వేల కోట్లు ఖర్చుపెట్టి రోడ్లు వేస్తున్న ప్రభుత్వానికి.. ఆటోడ్రైవర్లకు ఇచ్చేందుకు డబ్బులు లేవని అబద్ధాలు చెప్పడం దారుణమన్నారు.ఆటోడ్రైవర్లను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్..వారిని మోసం చేసిందని ఆరోపించారు. ఢిల్లీకి మూటలు పంపుతున్న రేవంత్ సర్కార్ ఆటో డ్రైవర్లను ఆదుకునేందుకు మాత్రం ముందుకు రావడంలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ సర్కారుకు వాటాల మీద ఉన్న శ్రద్ధ ఆటోడ్రైవర్లపై లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామనిచెప్పి రాహుల్ గాంధీ మాట తప్పారని,ఆటో కార్మికులకు సమాధానం చెప్పాలన్నారు. రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకుకాంగ్రెస్ ప్రభుత్వం రూ.1500కోట్లు బాకీ పడిందన్నారు. పక్కరాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడుఅధికారంలోకి వచ్చిన ఏడాదికే ఆటోడ్రైవర్లకు రూ.15 వేలు ఇచ్చారని, రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండేండ్లవుతున్నా ఇంకా హామీ ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు.

# రియాజ్ కుటుంబానికి పోలీసుల వేధింపులు..?



## మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు..!

**హైదరాబాద్, అక్టోబర్ 27,తెలంగాణ దిశ:** ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన షేక్ రియాజ్ కుటుంబ సభ్యులు సోమవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ను ఆశ్రయించారు. తన కొడుకు ఎన్‌కౌంటర్‌కు దారి తీసిన పరిస్థితులు, ఆ తరువాత పోలీసులు తమను వేధిస్తున్న తీరుపై రియాజ్ తల్లి, భార్య, పిల్లలు కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో రియాజ్ కుటుంబ సభ్యులు తమను స్వగ్రామంలోకి కూడా రానివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, తీవ్రంగా వేధింపులకు గురిచేస్తూ థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని కమిషన్‌కు వివరించారు. మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్‌తో రియాజ్‌కు ఆర్థిక లావాదేవీల విషయంలో గొడవలు ఉన్నాయని రియాజ్ కుటుంబ సభ్యులు కమిషన్‌కు వివరించారు. రియాజ్ భార్య తన ఫిర్యాదులో.. కానిస్టేబుల్ ప్రమోద్ ఒక కేసు విషయంలో రియాజ్‌ను రూ. 3 లక్షలు డిమాండ్ చేశారని.. రియాజ్ అప్పటికప్పుడురూ.30వేలు చెల్లించాడని తెలుపు తూ.. మిగతా డబ్బులు ఇవ్వాలని ప్రమోద్ రియాజ్‌ను తీవ్రంగా వేధించారని ఆరోపించింది. ఇకపోతే ఈఎన్‌కౌంటర్ ఘటనపై రాష్ట్రమానవ హ క్కుల కమిషన్ గతంలోనే సుమోటోగా కేసు స్వీకరించింది. దీనికి సంబంధించిన సమగ్ర నివేదికను వచ్చే నెల (నవంబర్) 24వ తేదీలోపు సమర్పించాలని రాష్ట్ర డీజీపీకి కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షామీమ్ అక్తర్ ఆదేశించారు. తాజాగా, రియాజ్ కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న కమిషన్ ఛైర్మన్.. నివేదిక సమర్పణ గడువును మరింత తగ్గిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు.వచ్చే నెల3వ తేదీలోపు నివేదికను సమర్పించాలని డీజీపీని ఆదేశించారు. ఈ ఎన్‌కౌంటర్ వ్యవహారం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు దృష్ట్యా రాష్ట్ర పోలీసులకు మరింత త్వరగా నివేదిక ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## తదుపరి సీజేఐగా
# జస్టిస్ సూర్యకాంత్.. !

### - సిఫార్సు చేసిన సీజేఐ జస్టిస్ గవాయ్-నవంబర్ 24న భారత 53వ సీజేఐగా ప్రమాణ స్వీకారం చేసే ఛాన్స్



**న్యూఢిల్లీ,అక్టోబర్,27:** ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ గవాయ్ పదవీకాలం ఈ ఏడాది నవంబర్ 23న ముగియనుంది. తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తి సూర్య కాంత్‌ను జస్టిస్ గవాయ్ సిఫార్సు చేశారు. ఈ సిఫార్సు ఆమోదం పొందితే నవంబర్ 24న జస్టిస్ సూర్యకాంత్ భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా విధులను స్వీకరించవచ్చు. ఆయన తన పదవీ కాలం ముగిసే వరకు, అంటే ఫిబ్రవరి 9,2027 వరకు సీజేఐగా కొనసాగవచ్చు. ఇటీ వల సీజేఐ భూషణ్ గవాయ్ మీడియాతో మాట్లా డుతూ.. "నాలాగే, జస్టిస్ సూర్యకాంత్ జీవితంలోని ప్రతి దశలోనూ పోరాటాన్ని అనుభవించిన సమాజంలోని ఒక వర్గం నుంచి వచ్చారు.

ఈ నిర్ణయం ముఖ్యంగా న్యాయవ్యవస్థ ఆ ప్రజల బాధలను తీర్చడానికి, వారి హక్కులను కాపాడుకోవడానికి, వారి బాధలను అర్థం చేసుకోవడానికి ఆయనఉత్తమంగా సన్నద్ధమవుతారనే పూర్తి విశ్వాసాన్ని నాకు ఇస్తుంది" అని అన్నారు.

# పత్తిలో తేమ.. కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాం: మంత్రి తుమ్మల



**హైదరాబాద్,అక్టోబర్,27,తెలంగాణ దిశ:** కొనుగోలు కేంద్రాలకు తీసుకురాకముందే పత్తిలో తేమ శాతాన్ని రైతులు తనిఖీ చేసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. తేమ శాతం 12కు మించకూడదని తేమ శాతం ఎక్కువైతే మద్దతు ధర లభించదన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తేమ శాతం ఎక్కువ ఉన్న కూడా పత్తిని కొనుగోలు చేయాలని కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. ఇవాళ మంత్రి తుమ్మల ఓ ప్రకటన విడుదల చేశారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించేందుకు మా ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఈ మేరకు సెప్టెంబర్ లోనే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్ కు లేఖ రాసినట్లు పేర్కొన్నారు.

# జర్నలిస్టులకు విరాహత్ అలీ క్షమాపణ చెప్పాలి

### - తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
### - టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్



**హైదరాబాద్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** :హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల ఫలితాల తర్వాత ఎన్నికల్లో పోటీ చేసి ఓడి పోయిన సహచర జర్నలిస్టులను ఉద్దేశించి టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ చేసిన వ్యాఖ్యలను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) తీవ్రంగా ఖండించింది. ఒక జర్నలిస్టు యూనియన్ కు అధ్యక్షుడుగా ఉండి తోటి జర్నలిస్టులను "విషసర్పాలని, బుడ్డర్ ఖాన్ లని, కొన్ని జర్నలిస్టు సంఘాలను బుడ్డ సంఘాలాంటూ కించపర్చడం, దూషించడం, తూలనాడడం సరైంది కాదని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం, వల్లాల జగన్, బండి విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు పేర్కొన్నారు. విష సర్పాలన్నీ ఏకమైనా తమను ఏమీ చేయలేకపోయాయంటూ సోషల్ మీడియాలో తెగ రెచ్చిపోయి పోస్టులు పెట్టడం జర్నలిస్టులను బాధించిందని అన్నారు. ప్రెస్ క్లబ్ ఎన్నికల సందర్భంగా గెలుపు లక్ష్యంగా అందరూ అవగాహనతో లేదా కూటమిగా ఏర్పడి పోటీ చేయడం సర్వసాధారణమన్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్యానెల్ లోపోటీ చేసినా, స్వతంత్రంగా పోటీ చేసినా గెలుపు ఓటములు సహజమని అన్నారు. అంతమాత్రాన ఓడిపోయిన జర్నలిస్టులను ఉద్దేశించి విరాహత్ అలీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహించరానిదని వారన్నారు. విరాహత్ అలీ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, సహచర జర్నలిస్టులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ వల్ల జర్నలిస్టులకు ఒరిగిందేమిటో, జర్నలిస్టుల సంక్షేమానికి ఏం చేశారో చెప్పకుండా ఎన్నికల పేరుతో ఒక వర్గం, ఒక యూనియన్ పెత్తనంతో క్లబ్ ను తమ కబంధహస్తాల్లో పెట్టుకొని ఆటాడుతున్నారని ధ్వజమెత్తారు. మంచి వాతావరణంలో జరగాల్సిన ప్రెస్ క్లబ్ ఎన్నికలను గందరగోళం చేసి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి రాజకీయం చేయడం, సభ్యులను తప్పుదోవ పట్టించడం బాధాకరమని అన్నారు. నిన్న జరిగిన ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులకు, అదే విధంగా ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎన్నికల్లోపోటీ చేసి గట్టి పోటీ ఇచ్చిన అభ్యర్థులకు వారు అభినందనలు తెలిపారు. గెలుపొందిన నూతన కార్యవర్గం రాబోయే రెండేళ్లలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి, యూనియన్ లకు తలొగ్గకుండా ప్రెస్ క్లబ్ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేయాలని వారు కోరారు.

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలి



**హైదరాబాద్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** : న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరుతూబార్ అసోసియేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు, ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్స్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ఎన్. అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ముఖ్యమంత్రి కార్యాలయంలో సమర్పించిన వినతి పత్రంలో కోరారు. అదే విధంగా తెలంగాణ న్యాయ కార్యదర్శికి ఈ మేరకు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులందరికీ కొత్త హెల్త్ కార్డులకు జారీ చేయాలని కోరారు. 41-ఎ సిఆర్ పిసికి సవరణ చేయాలని, అదే విధంగా న్యాయవా దులకు స్టైఫండ్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన పోస్తూ బ్లేస్సి



**నాగారం, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** :జిఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ రోలింగ్ స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ శ్రీరామ్ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలో నాగారంలోని సెంట్ మేరీ బెతానీ కాన్వెంట్ విద్యాలయ హైస్కూల్ లో రెండవ తరగతి చదువుతున్న విద్యార్థినీ పోస్తూ బ్లేస్సి అండర్ 8లో గోల్డ్ మెడల్ సాధించింది. ఈ పోటీల సందర్భంగా స్పీడ్ స్కేటింగ్ కోచ్ కన్నా గౌడ్ మాట్లాడుతూ శారీరక, మానసిక దృఢత్వానికి స్కేటింగ్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. వివిధ స్కూల్స్ లో విద్యార్థులకు స్కేటింగ్ నేర్పించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల స్కేటింగ్ ప్రో, ఇన్ లైన్ స్కేటింగ్, క్వాడ్ స్కేటింగ్, రెగ్యులర్ ఇన్ లైన్స్ స్కేటింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ స్కేటింగ్ టోర్నమెంట్ లో సుమారు 400 మంది పైగా విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు శ్రీరామ్, కన్నా గౌడ్, రోషన్ సింగ్, వి. గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### - మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు



**హైదరాబాద్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** :మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో తెలుసుకునేందుకు మహిళా కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు సోమవారం నాంపల్లి నుండి ఆర్టీసీ బస్సులో మహిళలతో కలసి ప్రయాణించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి మహిళలతో చర్చించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్కడికి వెళ్లాలన్న ఉచితంగా వెళ్తున్నామని మహిళలు స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. కార్యాలయాలు, కళాశాలలు, దేవాలయాలు, బంధువుల ఇళ్లకు బస్సులలో ఉచితంగా వెళ్తున్నామని స్పష్టం చేసినట్లు ఆమె తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా చాలా వరకు డబ్బులు ఆదా అవుతున్నాయని మహిళలు సంతోషం వ్యక్తం చేసినట్లు సునీత రావు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు రూ. 6 వేల కోట్లు మహిళల కోసం ఖర్చు చేసినట్లు ఆమె తెలిపారు. 200 యూనిట్ల విద్యుత్తు ఉచితంగా ఇస్తున్నామని, అదే విధంగా రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం జరుగుతుందన్నారు. సన్న బియ్యం తో పాటు ఆరోగ్యశ్రీని రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. పది సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో మీరు ఏం చేశారని ఆమె ఎద్దేవా వేశారు. హరీష్ రావుకు ప్రస్తుతం ఆటో కార్మికులు గుర్తుకు వస్తున్నారా అని ఆమె ప్రశ్నించారు. పది సంవత్సరాల నుండి తెలంగాణలో ఒక్క రేషన్ కార్డు, ఒక ఉద్యోగం ఇవ్వకుండా ప్రజలను మోసం చేశారని ఆమె ఆరోపించారు. ఆటో కార్మికులను రెచ్చ గొడుతూ అడ్డదిడ్డంగా మాట్లాడితే ప్రజలు ఊరుకోరని ఆమె హెచ్చరించారు. జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తున్నారని భయంతో అక్కస్సుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ నేతలు అబద్ధపు మాటలు మాట్లాడితే మహిళలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని అన్నారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ వాళ్లు ఊరుకోరు ఖబర్దార్ బిఆర్ఎస్ నాయకుల్లారా అని ఆమె హెచ్చరించారు. మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఇస్తే అప్పుల తెలంగాణగా చేసి రూ. 7 లక్షల కోట్లు బిఆర్ఎస్ నాయకులు మింగేశారని సునీత రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కూడా కాలేదన్నారు. మీరు పది ఏళ్లలో చేయని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రెండు సంవత్సరాలలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిందని సునీత రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షురాళు ,, నియోజకవర్గ బ్లాక్ డివిజన్ అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూములు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలు

### - సహకరిస్తున్న నిజాంపేట కమిషనర్ పై చర్యలు తీసుకోవాలి : ఆకుల సతీష్

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** :ప్రభుత్వ భూములు, చెరువుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు సహకరిస్తున్న నిజాంపేట్ కమిషనర్ మహమ్మద్ సాబేర్ అలీ పై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో సర్వే నెంబర్ 274 చూపిస్తూ సర్వే నెంబర్ 233/15 ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని అక్రమ విల్లాల అనుమతులు నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు బాచుపల్లి ఎమ్మార్వో నిజాంపేట్ కమిషనర్ లెటర్ రాసిన మూడు నెలల నుండి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. సర్వే నెంబరు 141 బాచుపల్లిలో అనుమతి తీసుకొని, సర్వేనెంబర్ 142 యుఎల్ సి ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని చేపడుతున్న అక్రమ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో నిజాంపేట్ కమిషనర్ కు లేఖ రాసి మూడు నెలలు గడుస్తున్న కన్ఫేర్ డెవలపర్స్ పై చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా



బాచుపల్లి బంధన్ కుంట చెరువులో విజన్ నిర్మాణ సంస్థ ఎన్ ఓసి లేకుండా చెరువు ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ లో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ తప్పుడు అనుమతులపై ఫిబ్రవరిలో నోటీస్ ఇచ్చిన కమిషనర్ ఇప్పటి వరకు చర్యలు తీసుకోక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిజాంపేట్ కమిషనర్ సాబీర్ అలీ పూర్తిగా ప్రభుత్వ భూములు చెరువుల్లో అక్రమ నిర్మాణాలకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చిన చర్యలు తీసుకోకుండా సహకరించడం పై విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్ రావు, చందు, ఈశ్వర్ రెడ్డి, పాండు తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం తథ్యం

### - మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27 (తెలంగాణ దిశ)** :జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి. నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని షేక్ పేట్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి జరుగుతున్న ప్రజా పాలన విధానాన్ని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు అనునిత్యం తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై అసత్యాలను అంటగట్టి గెలవాలని చూడటం వారి భ్రమ మాత్రమే అన్నారు. చిన్న శ్రీశైలం యాదవ్ తో సహాయం కోరిన వారే ప్రస్తుతం అసత్యాన్ని ప్రచురించడం చాలా బాధాకరమన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుపై నియోజకవర్గం ప్రజలు గట్టి నమ్మకంతో ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి, నర్సింహా రావుతో పాటు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికంగా పారిశ్రామిక రంగ అభివృద్ధికి గీతాంజలి కాలేజీతో ఎంఓయు ఒప్పందం

### - సీఐఏ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి





**చర్లపల్లి, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** :ఇంజనీరింగ్ విద్యా సంస్థల సహకారంతో పారిశ్రామిక రంగాన్ని సాంకేతికంగా మరింత అభివృద్ధి చేసేందుకు చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం (సిఐఏ) చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోనే తొలిసారిగా చర్లపల్లి పారిశ్రామికవేత్తల సంఘం కీసర మండలం చీర్యాల గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీతో అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది.సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐఏ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ జిఆర్. రవీందర్ రెడ్డి ఎంఓయుపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారాచర్లపల్లి పారిశ్రామికవాడలోని పరిశ్రమలకు కావలసిన సాంకేతిక నైపుణ్యంతో కూడిన మ్యాన్ పవర్ను గీతాంజలి కాలేజీ అందించనుంది. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవడం, పరిశ్రమలకు అవసరమైన మ్యాన్ పవర్ సమకూర్చడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని తెలిపారు. దీని కోసం ప్రత్యేకంగా వెబ్ సైట్ను రూపొందించి పరిశ్రమలకు అవసరమైన సాంకేతికత, మ్యాన్ పవర్ వివరాలను అందుబాటులో ఉంచుతామని చెప్పారు. విద్యార్థులు ఈ వెబ్ సైట్ ద్వారా పరిశ్రమలతో నేరుగా సంబంధాలు ఏర్పాటు చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందవచ్చుననివివరించారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఎంఓయు ద్వారా ఇరువురికీ ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని ఇతర పారిశ్రామిక వాడలకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. విద్యార్థులు పారిశ్రామిక అనుభవాన్ని పొందుతూ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలను పొందగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐఏ సలహాదారు జె. నరేందర్ రెడ్డి, గీతాంజలి విద్యా సంస్థల వైస్ చైర్మన్ ఆర్. హరిచందర్ రెడ్డి, డైరెక్టర్ ఎస్. ఉదయ్ కుమార్, సీఐఏ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, గంగాధర్ బాబు, రాజు, వీరమోహన్, అవినాష్, అనంత్, శివ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కాలనీ రోడ్లను మరమ్మత్తు చేయాలి : బిజెపి

### - రోడ్లపై పొంగి పొర్లుతున్న డ్రైనేజీ





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ)** :నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీరోడ్లు తక్షణమే మరమ్మత్తు చేయాలని కోరుతూ బిజెపి ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి నిజాంపేట్ అధ్యక్షుడు బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్ కాలనీకి సంబంధించిన రోడ్లు గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మత్తులకు నోచుకో లేకుండా అస్తవ్యస్తంగా తయారయ్యాయని అన్నారు. సాయిబాబా గుడి సమీపంలో డ్రైనేజీ నిత్యం పొంగిపొర్లుతూ డ్రైనేజీ నీరు రాకపోకలు సాగించే వారిపై పడుతుందన్నారు. ఈ విషయమై నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు వినతి పత్రాలు సమర్పించిన దున్నపోతు పైన వర్షం కురిసినట్టుగా ఉందన్నారు. తెలుగు విశ్వవిద్యాలయంలో చదువుకునే విద్యార్థులు కూడా ఇదే రోడ్డు మీదుగా రాకపోకలు సాగిస్తారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్ల మరమ్మత్తులతో పాటు డ్రైనేజీ లీకేజీలను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, శ్రీనివాస్ గుప్తా, కార్యదర్శి సతీష్ కృష్ణ, బిజెవైఎం అధ్యక్షులు ఎన్ ఆర్ కె ముదిరాజ్, ఐటీ సెల్ కన్వీనర్ కిషన్, సీనియర్ నాయకులు మల్లేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## రాష్ట్రాలను మింగేస్తున్న ఉచిత పథకాలు..!

ఉచిత పథకాలు, నగదు బదిలీలు రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా.. తమ చేతికి ఎముక లేదన్నట్లుగా పాలకులు వ్యవహరిస్తున్నారు. తాజాగా ఏపిలో ఆటోడ్రైవర్లకుచేయూత కింద ఒక్కొక్కరికి 15వేలు జమ చేస్తున్నారు. డ్రైవర్లకు 15వేల పథకం ప్రారంభంలో ఓ మహిళా డ్రైవర్ తమ ఇంట్లో ఎన్ని ఉచిత పథకాలు అందుతున్నాయో తెలిపారు. ఒక ఇంట్లో ఉన్న వారందరకీ ఇలా నగదు అందితే రాష్ట్రం దివాళా తీయకుండా ఉంటుందా? దీనన్ని ఎలా సమర్థించుకుంటారు. జనసేనాని, డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడా ఈ పథకాలను సమీక్షించాలని కోరుకోవడం లేదా? ఇప్పటికే ఉభయ తెలుగు రాష్ట్రాలు దివాళా దిశగా పయనిస్తున్నాయి. ఒకవైపు ఉచిత పథకాలు, మరోవైపు రాజకీయ నాయకుల ఖర్చులతో రాష్ట్రాలు కుదేలవుతున్నా..ఎవరు కూడా పట్టించు కోవడం లేదు. ఉమ్మడి ఎపి విడిపోయాక కెసిఆర్, జగన్‌ల కారణంగా ఇప్పుడు దాదాపు రెండు రాష్ట్రాలు సుమారు 15 లక్షల కోట్ల అప్పుల్లో మకూరుకుపోయాయి. వీటికి వడ్డీలకు డబ్బులు కట్టలేకపోతున్నారు. నెలనెలా వేలకోట్లు వడ్డీలకే చెల్లిస్తున్నారు. డ్రైవర్లకు 15వేలు, మహిళలందికీ ఉచిత బస్సులు, దరఖాస్తు చేసుకున్న ప్రజలందరికీ రేషన్ కార్డులు, కిలో రూపాయికి సన్న బియ్యం పథకాలు, ఆరోగ్యశ్రీలు, ఉచిత విద్యుత్, రైతుభరోసాలు, ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయి. ఇక ఎంపిలు, ఎమ్మెల్యేలకు లక్షల్లో జీతాలు, రెండు పెన్షన్లు, రకరకాల ఖర్చులు, హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో నేతల పర్యటనలు.. ఇవన్నీకలసి తడిసి మోపెడు అవుతున్నాయి. దార్రిద్య రేఖకు ఎగువన ఉన్నవారు కూడా తెల్ల రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా చర్యలు లేవు. ఇందిరమ్మ ఇళ్లు ఎన్ని నిర్మించాలనే విషయంలో కూడా శాస్త్రీయత పాటించడం లేదు. ఇందిరమ్మ ఇళ్లకోసం నిజమైన అర్హులు అన్నది పక్కకు పోయి నేతలు ఎంపిక చేసిన వారి పేర్లు ముందుకు వచ్చాయి. రాష్ట్రమంతటా దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలంటే రాష్ట్ర బ్జడెట్ కూడా సరిపోదు. అలాగని కొందరికి మాత్రమే ఇళు కేటాయిస్తే మిగిలిన వారిలో అసంతృప్తి నెలకొంటుంది. అన్ని పథకాలనూ ఒకేసారి ప్రారంభించాలనుకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యం కాని నిర్ణయాలు తీసుకుంటున్నారు. చంద్రబాబు కూడా తొలినాళ్లలో ఉచిత పథకాలకు దూరంగా ఉండేవారు. కానీ అధికార యావతో ఆయన కూడా ఉచిత పథకాలనే ఆశ్రయిస్తున్నారు. అధికార మత్తులో పడ్డవారికి రాష్ట్ర బాగోగులు పట్టడం లేదు. అవినీతి విషయంలో కూడా ప్రభుత్వాలపై విమర్శలు మొదలయ్యాయి. కొంతమంది మంత్రులు అపరిమిత అధికారాలను అనుభవిస్తుండగా, ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యం లేకుండా పోతోందని శాసనసభ్యులు వాపోతున్నారు. ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. తెలంగాణలో ఇంకా నిరుద్యోగులకు ఉద్యోగాల జాతర అన్నది ఇచ్చిన హామీ మేరకు కార్య రూపం దాల్చడం లేదు. మొత్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా బాలారిష్టాలను అధిగమించలేదన్నది సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజల్లో ప్రభుత్వం పట్ల అసంతృప్తి మెల్లగా వ్యాపిస్తోంది. కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ఏంజరిగిందో చెప్పడానికి పెద్దగా ఏమీ లేదు. సమగ్రప్రణాళిక చేయకుండా కొన్ని కార్యక్రమాలను హడావిడిగా అమలు చేయడం వల్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై విమర్శలు వస్తున్నాయి. పథకాలను విశ్లేషించడం లేదు. కేవలం కిలో రూపాయికే సన్నబియ్యం గురించి గొప్పలు చెబుతున్నారు. వడ్డీలు తగ్గించుకునే ప్రయత్నాలు అటు చంద్రబాబు, ఇటు రేవంత్ రెడ్డిలు చేయడం లేదు. ఉచిత పథకాలను గొప్పగా చెబుతున్నారు. పెన్షన్ల పంపిణీకి నెలనెలా చంద్రబాబు హెలికాప్టర్లు వేసుకని ఊరేగుతున్నారు. తెలంగాణలో దాదాపు రూ.25వేల కోట్ల మేర రుణమాఫీ చేసినా ఆశించిన రాజకీయ ప్రయోజనం నెరవేర లేదు. వరదలు వస్తే సకాలంలో ఆదుకోవడం లేదు. రోడ్లు గుంతలు పడిపోతే బాగు చేయడం లేదు. ఇటీవలి వరదల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కేంద్రంపై ఆధారపడడం తప్ప రాష్ట్రప్రభుత్వం పెద్దగా చేసిందేమీ లేదు. అందుకే రైతులు కూడా సంతృప్తిగా లేరు. రేషన్ కార్డుల పంపిణీ వ్యవహారంలో, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు స్వీకరణలో కూడా సరైన కసరత్తు జరగలేదు. ఎపిలో పేదలకు ఇళ్ల విషయం లోనూ ఇదే జరుగుతోంది. అక్కడంతా అమరావతి, పోలవరం చుట్టూ చంద్రబాబు ప్రదక్షిణ చేస్తున్నారు. చీప్ లిక్కర్ కేసులో ఇప్పుడు సొంతపార్టీ నేతలే దొరకడంతో తెలుగుదేశం ఇరకాటంలో పడింది. గతంలో ఎపిలో జగన్, తెలంగాణలో కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు వారు అపరిమిత అధికార దర్పాన్ని ప్రదర్శించారు. అవినీతిని ప్రోత్సహించారు. అప్పులు చేసి రాష్ట్రాలను ఆర్థికంగా దివాళా తీయించారు. డబ్బులను పందేరం చేసి ఓట్లను కొనాలని చూశారు. అయినా ప్రజలు గెలిపించలేదు. ఇప్పుడు చంద్రబాబు, రేవంత్ అదే పనిచేస్తున్నారు. ఇలాంటి పథకాలను సమీక్షించాలి. ఆర్థికంగా దెబ్బతీస్తున్న పథకాలను అదుపులోకి తేవాలి. ఉచిత పథకాలను రద్దుచేయాలి. లేదా క్రమబద్దీకరించాలి. ముఖ్యమంత్రులు ఇప్పటికైనా పరిస్థితులను మదింపు చేసుకొని తగు దిదిద్దుబాటు చర్యలు చేపట్టని పక్షంలో పరిస్థితి చేయి దాటిపోయినా ఆశ్చర్యపోవాల్సిందిఉండదు. తెలంగాణలో అధికారంలోకి రావాలని భారతీయజనతా పార్టీ కలలు కంటోంది. కానీ ఉచిత పథకాలు, ఆర్థిక దుబారాపై మాట్లాడడం లేదు.గతంలో సుప్రీం కోర్టు పలు సందర్భాల్లో ఉచిత పథకాలపై అనేక హెచ్చరికలు చేసింది. ఇది అనుసరించి సమీక్షించుకునే సమయంగా చూడాలి. లేకుంటే తెలుగు రాష్ట్రాలు మరింత దివాళా తీసి జీతాలు కాదుకదా దేనికీ డబ్బులు లేకుండా వడ్డలు కట్టుకుంటూ కూర్చునే దుస్థితి రాగలదు.

# పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఆటో డ్రైవర్లకు ఏమి చేశారో చెప్పండి..

## - మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు



**హైదారాబాద్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :**పదేళ్లలో ఆటో డ్రైవర్లకు ఏమి చేశారో చెప్పాలని మహిళ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావు బిఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. బిఆర్ఎస్ నేతలు చేసిన ఆటో యాత్రలకు కౌంటర్ గా మహిళ కాంగ్రెస్ నేతలు నాంపల్లి నుంచి ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళలు అంటే బీఆర్ఎస్ కు చిన్న చూపు అన్నారు. కుటుంబంలోనే మహిళను గౌరవించని బిఆర్ఎస్ నాయకులు బయట వారిని ఎలా గౌరవిస్తారని నిలదీశారు. గతంలో ఐదు ఏళ్ల పాటు మహిళను మంత్రి కూడా చేయని మహిళ వ్యతిరేక పార్టీ బిఆర్ఎస్ అని ఆమె విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన మహిళలకు మంత్రి పదవులు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆటో డ్రైవర్లపై ప్రేమ ఉన్నట్లు నటిస్తున్నారని ఆమె అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు వాళ్లకు ఏమి చేశారని ఆమె ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్ రవాణా అవకాశం ఇస్తే బిఆర్ఎస్ భరించలేక పోతుంద న్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అడ్డ గోలు అవినీతి అప్పులు చేసి దివాళా తీశారని అన్నారు. వాళ్ళు అప్పులు చేయకపోతే కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ వంద రోజుల్లోనే అమలు చేసే వాళ్ళమన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఎన్ని నాటకాలు ఆడినా కాంగ్రెస్ విజయాన్ని ఎవరు ఆపలేరన్నారు.

# అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారికి అష్టోత్తర శత (108) కలశములతో క్షీరాభిషేకం





**నాగారం, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :**నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ వి నగర్ రోడ్ నెంబర్ 8 లో శ్రీ లక్ష్మీ గణపతి అన్నపూర్ణ సహిత కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో సోమవారం మహిళ మణుల సహకారంతో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారికి 108 కలశాలతో క్షీరాభిషేకం (పాలతో) నిర్వహించారు. ఈ ఆలయంలో శ్రీ కోదండ రామాంజనేయ స్వామి, శ్రీ వల్లి దేవసేనా సహిత సుబ్రహ్మణ్యస్వామి, నాగబంధ, మృత్యుంజయ, మేధా దక్షిణామూర్తి, అభయాంజనేయ, నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా విగ్రహాలకు క్షీరాధివాసం చేశారు. ఈ నెల 29 వరకు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం కొనసాగుతుందని, 29వ తేదీ బుధవారం దేవతామూర్తుల ప్రతిష్టలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు ఎంవిఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ సుబ్రహ్మణ్య శర్మ సహాయకులు జమ్మలమడక శ్రీరమణ శర్మ, ఆలయ అధ్యక్షులు దాచా శ్రీనివాస్ గుప్తా ఎర్రం ఈశ్వరయ్య గుప్త, లింగా నాగేంద్రగుప్త, పీవీవీ. సత్యనారాయణ నరసింహస్వామి గౌడ్, గంగిరెడ్డి నరేందర్ రెడ్డి, మారెళ్ల వెంకటేశ్వరావు, వి. నర్సింహాస్వామి గౌడ్, ఆంజనేయ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయం తథ్యం







**జూబ్లీహిల్స్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం బిఆర్ఎస్ నేతలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బోరబండ డివిజన్ లోని క్లస్టర్ – 2 బూత్ నెంబర్ 333, 322 లోని స్వరాజ్ నగర్, బంజారా నగర్ లలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఓటర్లకు వివరిస్తూ బిఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నట్లు తెలిపారు. గత శాసనసభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోలేదని, ఈ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ స్థానిక బూత్ కమిటీ సభ్యులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# సిద్ధార్థ నగర్ కాలనీ ఫేజ్ -1 లో సమస్యలను పరిష్కరిస్తాం






**దమ్మాయిగూడ, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :**దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని సిద్ధార్థ నగర్ కాలనీ ఫేజ్ -1 లో సమస్యలను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం సిద్ధార్థ నగర్ కాలనీలో కాంగ్రెస్ పార్టీ దమ్మాయిగూడ పట్టణ అధ్యక్షులు ముప్పా రామారావుతో కలిసి పర్యటించారు ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఇందుకు కమిషనర్ వెంకటరెడ్డి సానుకూలంగా స్పందించారు. అనంతరం కాలనీ అసోసియేషన్ నాయకులు కమిషనర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, కాలనీ వాసులు, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా సైకిల్ ర్యాలీ





**కుషాయిగూడ, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :** పోలీస్ అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా కుషాయిగూడ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈసీఐఎల్ చౌరస్తా నుంచి ప్రారంభమై, ఏఎస్ రావునగర్ సిగ్నల్ వరకు వెళ్లి, తిరిగి ఈసీఐఎల్ చౌరస్తాకు చేరుకుంది. కుషాయిగూడ ఎసిపి వై. వెంకటరెడ్డి, ఎస్ హెచ్ ఓ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్ఐలు ఎన్. సుధాకర్ రెడ్డి, ఎన్. వెంకన్న, సతీష్, విజయ్, కుషాయిగూడ పీఎస్ సిబ్బంది కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులు, యువత ఉత్సాహంగా పాల్గొనడం వల్ల ఈ కార్యక్రమం విజయవంతమైంది.



# షెడ్యూలు కులాల సమస్యలను పరిష్కరించాలి

**కాప్రా, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :**షెడ్యూలు కులాల (ఎస్ సి) సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కుమార్ కోరారు. సోమవారం ఎస్ సి సెల్ కామారెడ్డి జిల్లాఅధ్యక్షులు మద్దెల బాగయ్య, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు బొమ్మల సుధీష్‌కుమార్ తదితరులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వెళ్లినట్లు వారు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారి వివరించారు.

# పారామెడికల్ కోర్సులు ప్రవేశానికి దరఖాస్తులు

**పెద్దపల్లి,తెలంగాణ దిశ:** ఈ నెలలోపు పారామెడికల్ కోర్సులు ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్‌మెడికల్ సైన్సెస్ ప్రిన్సిపల్ డాక్టర్ హిమ బిందు సింగ్ తెలిపారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబ ంధంగా నడుస్తున్న 28 అలైడ్ హెల్త్ సైన్స్ కళాశాలలో పారా మెడికల్ డిప్లమా కోర్సులలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం పారామెడికల్ బోర్డు నోటిఫికేషన్ జారీ చేసిందని అన్నారు. డి.ఎం.ఎల్.టిలో 30 సీట్లు, దయాలసిస్ లో 30 సీట్లుకోర్సులలో చేరడానికి ఇంటర్ లోబైపిసివి ద్యార్థుల నుంచి దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నామని, బైపిసివిద్యార్థుల సరిపడా లేని సందర్భం లో ఇంటర్ ఎంపీసీ విద్యార్థులకు అవకాశం ఇవ్వడం జరుగుతుంద ని అన్నారు.

# పాండవులగుట్టను సందర్శించిన హెరిటేజ్ వాలంటర్లు




**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పాండవుల గుహలను సందర్శించిన వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్స్ క్యాంప్ 20 25 వచ్చిన విద్యార్థిని విద్యార్థులు ప్రపంచ ప్రఖ్యాతిగాం చిన యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ రామప్ప దేవాలయం దగ్గర పది రోజులు హెరిటేజ్ వాలంటీర్ క్యాంప్ 2025ను కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రొఫెసర్ పాండురంగారావు మరియు శ్రీధర్ రావు నిర్వహిస్తున్నారు పర్యాటకశాఖ తెలంగాణ ప్రభుత్వం సహకారంతో నిర్వహిస్తున్న ఈ క్యాంపు లో శిక్షణలో భాగంగా 5వ రోజు పాండవుల గుహలను సందర్శించారు వీరికి ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్య కిరణ్ పాండవుల గుహల చరిత్రను వాటి ప్రాముఖ్యతను వివరించారు మరియు క్యాంప్ కోఆర్డినేటర్ గా శ్రీధర్ రావు వ్యవహరిస్తున్నారు పాండవుల గుహల ను స్థానికుడు రావుల తిరుపతి తో పాండవుల గుహల లోని అన్ని ప్రదేశాలను తిలకించారు ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పాండురంగా రావు,శ్రీధర్ రావు,శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ సూర్య కిరణ్ మరియు అటవీ శాఖ సిబ్బంది శ్రీక రావుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# పద్దైన తెరుచుకోని పాఠశాల.. సార్ కోసం వేచి ఉన్న పిల్లలు

**ఆసిఫాబాద్,తెలంగాణ దిశ:** జిల్లాలో గిరిజన పాఠశాలల నిర్వహణ అధ్వాన్నంగా తయారైంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం పట్టింపులేని కారణంగా ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉ్నాయి.ఆసిఫాబాద్ మండలంలోని బానర్ గొంది గిరిజన ప్రాథమిక పాఠశాల ఉ.10గంటలు దాటిన తెరుచుకోలేదు. పాఠశాలకు వచ్చినపిల్లలు సార్ రాకకోసం స్కూల్ ఎదుటఎదురు చూస్తూ కూర్చున్నారు. గతంలో సైతం ఇదే తరహాలో వ్యవహరించగా అధికారులకు ఫిర్యాదు చేసిన అతనిలో ఎలాంటి మార్పు రాలేదని డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కార్తీక్ ఆరోపించారు.

# ప్రభుత్వాలు మారినా.. బతుకులు మారలేదు!


**తాంసి,తెలంగాణ దిశ:** ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారలేదని ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉందని తాంసి మాలీ సంఘం మహాజన్ ఆశన్న ఆవేదన వ్యక్తంచేశారు.తాంసి మండల కేంద్రంలో మాలీల జెండా పండుగ వారోత్సవాలలో భాగంగా జెండా పండుగ కార్యక్రమా న్ని నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల ఆశయ సాధన, మాలీల ఉద్యమ హక్కుల సాధనకు 10 అక్టోబర్ 2002 న ఉద్యమాన్ని ప్రారంభించామని తెలిపారు. విద్య ఉద్యోగ ఉపాధి రాజకీయ లలో వెనుకబడి ఉన్నామని ఎస్టీ హెూదా బిల్లును ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపి మాలిలకు ఎస్టీ హెూదా కల్పించాలని కోరారు.



# ప్రభుత్వ భూమికి నాలా కన్వర్షన్


## కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలి - ప్రజావాణిలో ఆకుల సతీష్ ఫిర్యాదు







2018 ఆగస్టు10న రెవెన్యూ అధికారులు కూల్చి వేసిన ఫైల్ ఫోటో






**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ):** ప్రవేట్ సర్వే నెంబర్ 328 చూపిస్తూ ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 329 గాజుల రామారంలో సుమారు 2000 గజాలు స్థలం 10 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అక్రమంగా కలెక్టర్ ఫోన్ కాల్ తో నాలా కన్వర్షన్ చేయడం ఎలా సాధ్యమని ఆకుల సతీష్ ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజుల రామారం దేవేంద్ర నగర్ లోని సర్వే నెంబర్ 329లో ప్రభుత్వ భూమి 253 ఎకరాలు ఉ ఒదన్నారు. దీనిలో చాలా ప్రభుత్వ భూమి ఇప్పటికే కబ్జాలకు గురైందన్నారు.అంతే కాకుండా ఈ సర్వే నెంబరు మధ్యలో ప్రైవేట్ సర్వే నెంబర్ 328 ఉందన్నారు. ఈ ప్రైవేట్ సర్వే నెంబర్ లో 10.39 ఎకరాల ప్రైవేటు భూమి వినస్ రాక్ హైట్స్ వెంచర్ వారికి డెవలప్ మెంట్ కు అమ్మి వేయడమే కాకుండా, వెంచర్ వేసి అమ్మకాలు, నిర్మాణాలు కూడా పూర్తి చేశారని వివరించారు. వీవన్ రాక్ హైట్స్ వెంచర్ వారు వారికి ఉన్న 10.39 ఎకరాల కంటే అదనంగా ఇప్పటికే 7,545 గజాల ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని ప్లాట్లుగా చేసుకొని అమ్మివేసారని ఆరోపించారు. కానీ ఇటీవల కాలంలో ఎడి సర్వే పేరుతో 2024 డిసెంబర్ 11న అధికారులను మంచిగా చేసుకొని మరో 2 వేల గజాలు ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 329 లోనిది ప్రవేట్ సర్వేనెంబర్ 328 లో చూపిస్తూ స్కెచ్ ప్లాన్ ఇచ్చారని తెలిపారు. దాదాపు రూ. 15 కోట్ల విలువ చేసే 2000 గజాల స్థలం కొట్టియడానికి నాలా కన్వర్షన్ కోసం రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారని, ఈ విషయమై 2025 జూన్ 9న ఫిర్యాదు చేశామని గుర్తు చేశారు. ఏదైతే ప్రస్తుతం ప్రవేట్ సర్వే నెంబర్ 328 అని చూపిస్తున్న ప్రభుత్వ భూమిలో గతంలో కబ్జా చేసుకుని కాంపౌండ్ వాల్ నిర్మాణం చేస్తే 2017, 2024లో విఆర్ఓ రజనీకాంత్ కూల్చివేయడం కాకుండా ప్రభుత్వ భూమి అని బోర్డు నాటారని గుర్తు చేశారు. ఈ విధంగా సర్వే నెంబర్ 329 లో ప్రభుత్వ భూమి 2000 గజల స్థలం ప్రవేట్ సర్వే నెంబర్ 328 చూపిస్తూ ల్యాండ్ గ్రాబర్ జానకి రామయ్య అనే వ్యక్తి శ్రీనివాస్ అమ్మారని ఆరోపించారు. కానీ 2024 డిసెంబర్ 11న జరిగిన ఏడి సర్వేలో సర్వేయర్ శ్రీనివాస్ ఏ విధంగా రిపోర్ట్ ఇచ్చారని ప్రశ్నించారు. అంతేకాకుండా సర్వే నెంబర్ 328 నందు 10.39 ఎకరాల భూమి ఇప్పటికే వెంచర్ వేసే అమ్మకాలు చేసిన మళ్లీ ఏ విధంగా ప్రైవేట్ వెంచర్ లో మిగిలిపోయిందని ఏ విధంగా చూపిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా సర్వేనెంబర్ 328లో చూపిస్తున్న ప్రభుత్వ భూమిని సెప్టెంబర్ 2025లో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు వ్యక్తికి కుత్బుల్లాపూర్ ఎమ్మార్వో ఇతర అధికారులు నాల కన్వర్షన్ చేశారని తెలిపారు. తప్పుడు ఏడి సర్వే రిపోర్ట్ తో ప్రభుత్వ భూమి రెండు వేల గజాలు కలెక్టర్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన విషయంలో సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నాలా కన్వర్షన్ ను రద్దు చేయాలని, ప్రభుత్వ భూములలో అక్రమంగా కంటైనర్ నర్సరీ పెట్టి ఆక్రమించుకున్న ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అమ్ముకున్న జానకి రామయ్య నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమిని నాల కన్వర్షన్ చేయించుకున్న శ్రీనివాస్ అనే వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



**Total Extent (Ac. Gts)**
0.2000
**Survey No./ Sub-Division No.**
328/2
**Land Status**
Signed as NALA

**Nature of Land**
Patta
**Classification of Land**
Metta/ Dry

**Land Type**
NALA Land

**Market value of Survey no.(in INR)**
47190000

**Transaction Status**
Survey No/ Sub-division no is marked Prohibited for transaction. Please visit https://registration.telangana.g
To get it deleted , Pl apply to Collector in TM 15 module of Bhu Bharathi portal i.e. Application for grievance




# మీనాక్షి నగర్‌లో సమస్యలు పరిష్కరిస్తా

## - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**చర్లపల్లి, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :** చర్లపల్లి డివిజన్ పరిధిలోని మీనాక్షి నగర్ లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. కాలనీలోజరుగుతున్న రోడ్డు పనులను ఎమ్మెల్యే వాసులతో కలిసి పరిశీలించారు. అక్కడ డ్రైనేజీ గురించి అడగగా వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సురేష్ గుప్త, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు కాలనీ వాసులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో డ్రా ద్వారా 118 వైన్ షాపుల కేటాయింపు










**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 27, (తెలంగాణ దిశ) :** మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలో 118 వైషు షాపులను డ్రా ద్వారా సోమవారం కేటాయించారు. జిల్లా కలెక్టర్మను చౌదరి ఎక్సైజ్ అధికారులు, టెండర్ దారుల సమక్షంలో డ్రా ద్వారా షాపులను కేటాయించారు. అదేవిధంగా మల్కాజిగిరి యూనిట్ పరిధిలో 28 వైన్ షాపులకు జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్త డ్రా ద్వారా షాపులను కేటాయించారు. బోడుప్పల్ లోని పలని కన్వెన్షన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో మేడ్చల్, మల్కాజిగిరి యూనిట్ల ఎక్సైజ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రంప్ ఒత్తిడితో జనరిక్ మందుల ధర పెంపు



జనరిక్ మందులపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం లేదు. ప్రస్తుతానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జనరిక్ మందులపై టారిఫ్‌లను విధించాలనే ప్రణాళికను వాయిదా వేయడంతో భారత ఔషధ తయారీదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే ఓ కీలక మార్పుతో జనరిక్ ఔషధ రంగానికి కూడా భవిష్యత్తులో పెను సవాళ్లు ఎదురుకానున్నాయి. ఇప్పటివరకు జనరిక్ మందులకు క్లినికల్ ట్రయల్స్ లేవు. అయితే జనరిక్ ఔషధదాలకు కూడా పరీక్షలు నిర్వహించాలని దేశీయ నిబంధనల్లో మార్పులు రాబోతున్నాయి. కొత్త ఔషధాల జనరిక్ వెర్షన్లను క్లినికల్ ట్రయల్స్ నిర్వహించిన తర్వాతే ప్రారంభించాలని తాజాగా దేశ ఔషధ నియంత్రణ సంస్థ ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను నియమంగా మార్చినట్లయితే జనరిక్ ఔషధాల మందులకు క్లినికల్ ట్రయల్స్‌పై ప్రత్యేక డేటాను సమర్పించాల్సి ఉంటుంది అని సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (సిడిఎస్‌సివో) తాజాగా ఒక నోట్‌ను విడుదల చేసింది. దీనివల్ల కొత్త మందుల్ని కనిపెట్టాలన్న కంపెనీలకు ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. భారతీయ నిబంధనల ప్రకారం సిడిఎస్‌సివో ద్వారా మార్కెటింగ్ ఆమోదం పొందిన నాలుగు సంవత్సరాల కాలం నుండి కొత్తదిగా పరిగణిస్తారు. అయితే ఆ నాలుగు సంవత్సరాల కాలంలో మరొక కంపెనీ.. 'తదుపరి కొత్త ఔషధం' ఆమోద మార్గం ద్వారా జనరిక్ వెర్షన్‌ను ప్రారంభించవచ్చు. దీనికి బిఇ డేటాను సమర్పించడం అవసరం. జనరిక్ మందులకు క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాల్సిన అవసరం లేనందున ఖర్చు చాలా తక్కువ. జనరిక్ ఔషధాలకు, ఫార్మా డ్రగ్స్ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించడానికి, కొత్త ఔషధాల అభివృద్ధి ప్రోత్సహించడానికి ఆయా కంపెనీల వాటాదారులతో సంప్రదించి చర్చించాలని సిడిఎస్‌సివో నోట్ తెలిపింది. ముందుగా ఎస్ఇసి (విషయ నిపుణుల కమిటీ)తో సంప్రదించి, కంపెనీల దరఖాస్తులను సమీక్షించిన త్వాత సిడిఎస్‌సివో నోట్‌ను విడుదల చేసింది. కాగా, సిడిఎష్‌సివో కొత్త ప్రతిపాదన వల్ల కొత్తరకం జనరిక్ మందుల్ని తయారు చేయడానికి ఎన్నో అడ్డంకులు ఏర్పడతాయి. ప్రధానంగా బయోఈక్వివలెన్స్ అధ్యయనాల కంటే కూడా.. ఔషధాల క్లినికల్ ట్రయల్స్ ఖరీదైనవి. పైగా ఎక్కువ సమయం కూడా తీసుకుంటుంది. ప్రస్తుతం క్లినికల్ ట్రయల్స్, బయోఈక్వివలెన్స్ (బిఇ) డేటా ఆధారంగా కొత్త ఔషధం ఆమోదించబడిన తర్వాత జనరిక్ కంపెనీలు ఏకకాలంలో.. బిఇ అధ్యయన నివేదికను ఔషధ నియంత్రణ సంస్థకు సమర్పించి ఆమోదం పొందేవి. క్లినికల్ ట్రయల్స్ లేనందున కంపెనీలు ఔషధాల్ని త్వరగా మార్కెట్లో విడుదల చేసేవి. అయితే ఈ ప్రతిపాదన వల్ల భారతీయ ఫార్మా రంగం నష్టపోతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జనరిక్ మందులపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహించాలనే ప్రతిపాదన భారతదేశంలోని అమెరికన్ కంపెనీలకు ప్రయోజనాలు చేకూర్చడానికేనని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లోని అమెరికన్ కంపెనీలకు నాన్ టారిఫ్ అడ్డంకులను తగ్గించాలని ట్రంప్ పరిపాలన నుండి పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలోనే సిడిఎస్‌సివో ఈ చర్య తీసుకున్నట్లు నిపుణులు తెలిపారు. క్లినికల్ ట్రయల్స్ ద్వారా జనరిక్ సంస్థలపై అదనపు భారం పడుతుంది. వారి స్వంత క్లినికల్ ట్రయల్స్ నిర్వహించమని తప్పనిసరి చేయడం, లేదా బిఇ అధ్యయనాలపై ఆంక్షలు విధించడం ద్వారా కొత్త ఔషధాల జనరిక్ వెర్షన్లు విడుదల ఆలస్యం కావొచ్చు. ఇప్పటివరకు చౌకగా దొరికే ఈ మందులు.. ఈ ఆంక్షలతో ధరలు పెరిగే అవకాశం ఉంది అని నిపుణులు అభిప్రాయపడ్డారు.

# హైదరాబాద్ అభివృద్ధికి.. రూ.10 వేల కోట్లు..



**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ రియల్ ఎస్టేట్ రంగం ఎదుగుదలకు అనుగుణంగా.. రాష్ట్రంలోని పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత నరెడ్కోపై ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైటెక్స్‌లో జరిగిన ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్ అభివృద్ధికి తమ ప్రభుత్వం ఏటా రూ. 10 వేల కోట్లు కేటాయిస్తోందని.. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ వంటి ప్రణాళికలతో నగర ముఖ చిత్రాన్ని మారుస్తున్నామని తెలిపారు. హైడ్రా చర్యల ద్వారా ప్రభుత్వ భూములు రక్షించబడుతు న్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రియల్ ఎస్టేట్ ఎదుగు దలను దృష్టిలో ఉంచుకొని.. రాష్ట్ర వనరులు, పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత నరెడ్కో పై ఉందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ప్రాపర్టీ షోను మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. నగర అభివృద్ధికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. గత రెండేళ్లలో దాదాపు రూ. 20 వేల కోట్లకు పైగా నిధులను హైదరాబాద్ అభివృద్ధికి వినియోగించి నట్లు ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో నగరం అన్ని దిక్కులా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలు అమలు చేయనున్నట్లు వివరించారు. హైదరాబాద్ ముఖచిత్రాన్ని మార్చేందుకు మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య ప్రాంతాలను కలుపుతూ నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్డు నగరంలో గ్రామీణ అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. మెట్రో వ్యవస్థ హైదరాబాద్ చుట్టూ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో నగరవాసులకు ట్రాఫిక్ నుంచి ఉపశమనం లభించనుంది. వీటితో పాటు.. మురుగు నీటి శుద్ధి కోసం రూ. 4 వేల కోట్లతో అత్యాధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మించబోతున్నారు. హైడ్రా వంటి సంస్థల ద్వారా ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కొంతమందిలో ఈ కఠిన చర్యలు భయం కలిగించినా, ప్రజా ఆస్తులు రక్షించబడుతున్నాయన్న మంచి ఫలితాలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాయదుర్గంలో ఇటీవల ఎకరా భూమి రూ. 177 కోట్ల ధర పలకడం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఎంత వేగంగా దూసుకుపోతుందో నిరూపిస్తుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నరెడ్కో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. కేవలం విల్లాలు, హై-రైజ్ భవనాల నిర్మాణం వరకే పరిమితం కాకుండా.. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో గృహాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. సంపద సృష్టికర్తలుగా రియల్టర్లను తమ ప్రభుత్వం గౌరవిస్తుందని పేర్కొంటూ.. వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు.

# పిల్లలకు కొత్త నైపుణ్యాలు నేర్పిద్దాం



ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ఉన్న మనతోపాటుగా ప్రపంచమంతా ఉరుకులు పరుగులతో కూడిన జీవితంలో సతమతమవుతున్నాం. కెరీర్, ఉద్యోగం, వ్యాపారం ఇలా కారణాలేమైనా వాటిని అందుకునే క్రమంలో పిల్లల పట్ల ఒకింత నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తూనే ఉన్నాం. వాళ్లే స్వయం శక్తితో ఎదుగుతారనే భరోసా కావొచ్చు. ప్రతిదీ నేర్చుకు ంటారనే నమ్మకమైనా ఉండొచ్చు. ఇంటిల్లిపాదీ ఇలా ఉరుకులు పరుగులు తీస్తున్న క్రమంలో పిల్లల చదువు, పెంపకం, ఆరోగ్యం ఇలా అనేక అంశాలు ప్రభావితం అవుతూనే ఉన్నాయి. తల్లిదండ్రులు బిజీగా గడుతున్న సమయంలో పిల్లలు మొబైల్‌ఫోన్లకు అలవాటు పడి వాటికి బానిసలుగా మారుతున్నారు. ఏదో కొద్దిసేపైతే ఫర్వాలేదు. ఖాళీ దొరికినప్పుడల్లా ఫోన్లతో వాళ్లు కూడా గడిపేస్తుండటం నేడు అన్నిచోట్లా చూస్తున్నాం. ఫోన్ లేదా టీవీలకు పిల్లలు అతుక్కుపోవటం కొంచెం ఆందోళన కల్గించే విషయమే. ఫలితంగా రొటీన్ పనుల చట్రంలో ఇరుక్కుపోయి స్థూలకాయులు, మందమతులుగా పిల్లలు మారిపోయే ప్రమాదం ఉంది. ఇక్కడ ఎవ్వరినీ నిందించాల్సిన అవసరం లేదు.

నేటి రోజుల్లో ఇంట్లో భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండటం తెలిసిందే. లేనిపక్షంలో కుటుంబ జీవనం గడవటం కష్టమవుతోంది. ఈ క్రమంలో పిల్లల పెంపకం విషయంలోనూ కాసింత ఓపిగ్గా తల్లిదండ్రులు కొంత శ్రద్ధ తీసుకుని వారిని సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. తాము బిజీగా ఉంటున్నామనే పేరుతో పిల్లల పెంపకం, వారి జీవన విధానాన్ని గాలికొదిలేస్తే ఆ ప్రభావం వారి పెంపకం, వృద్ధి, వికాసంపై కూడా పడుతుంది. ప్రతిరోజూ ఎంతోకొంత సమయం పిల్లలకు కేటాయిస్తే వారి ఇబ్బందులు, సమాజపరంగా ఎదుర్కొంటున్న సమస్యలు, చదువుపరంగా కావాల్సిన అవసరతలు తెలుసుకుని పరిష్కరించటానికి అవకాశం ఉంటుంది. మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు రాబోతున్నాయి. ఈ సెలవుల్లో తమ పిల్లల ఆసక్తులను తెలుసుకుని, గమనించి తల్లిదండ్రులు తమ పిల్లలకు ఏదోఒక కొత్త నైపుణ్యాలను నేర్పిస్తే వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అవకాశం ఉంటుంది.

నైతిక విలువలు : పిల్లలకు నీతికథలు, సూక్తులు, జాతీయాలు, మంచీచెడు గురించిన విచక్షణ గురించి సవివరంగా తెలియజేయాలి. ఎలా ఉండాలి? ఎలా ఉండకూడదు? కుటుంబంలోని పెద్దల పట్ల ఎలా ఉండాలనేది తెలియజేయాలి.

స్వయంగా నేర్చుకోవాలి : చిన్న కుటుంబాలు కావటంతో సమయంలేక పిల్లలకు ఫోన్లు ఇచ్చేస్తున్నాం. వారు యాంత్రిక జీవితానికి అలవాటు పడుతున్నారు. స్వతంత్రంగా ఆలోచించే శక్తి ఉండటం లేదు. యానిమేటెట్ లోకమే నిజమనుకునే పరిస్థితి ఉంది. ఇలా కాకుండా వారితో మమేకమై కొత్త విషయాలు నేర్పించాలి.

సృజనాత్మకత : పిల్లల్లో ఆల్‌రౌండ్ అభివృద్ధి చెందాలంటే వారి వయస్సుకు సరిపడినంత ఆలోచనా శక్తిని పెంపొందించాలి. తార్కికంగా ఆలోచించేలా ప్రోత్సహించాలి. సృజనాత్మకను తట్టి లేపాలి. కష్టం, సుఖం, లాభం, నష్టం, ఆనందం, దు:ఖం, గెలుపు, ఓటములు అనే నిజ జీవితాన్ని పరిచయం చేయాలి.

బాధ్యతను గుర్తుచేయాలి : కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల పాత్రల గురించి తెలియజేయాలి. వారి పట్ల ఎలా నడుచుకోవాలో వివరించాలి. క్రమశిక్షణగా ఉంటే ఒనగూరే ప్రయోజనాలు, లోపిస్తే వచ్చే దుష్పరిణామాలు తెలపాలి. ఏరోజు పాఠాలు అదేరోజు చదివేయటం, హోంవర్కులు పూర్తిచేయటం వంటివి ప్రోత్సహించాలి. దైనందిన కార్యక్రమాల్లో అలసత్వం ప్రదర్శించకుండా చూడాలి.

విచక్షణ పెంపొందించాలి : జీవితం అంటే అన్ని కల గలిపిన నిజ ప్రపంచమని పిల్లలకు తెలియజేయాలి. బయటా లేదా ఇంట్లో ఉన్న పెద్దవారితో పిల్లలను మాట్లాడించాలి. తద్వారా పిల్లలు జ్ఞానవంతులు అవటమే కాకుండా భాషా సంపదను కూడా వృద్ధి చెందించే వారవుతారు.

మానసిక వికాసం : పిల్లలు నేడు ప్రధానంగా ఎదుర్కొనే సమస్యల్లో మేధా సంపత్తిలోపం ఒకటి. దీని కోసం ఆటలు ఆడించాలి. చదరంగం (చెస్), చిన్న చిన్న గణిత ప్రశ్నల సాధన, ఏక చలరాశిలో సమీకరణల సాధన, చతుర్విద ప్రక్రియల మీద సాధన, గణన సామర్థ్యం అత్యంత ఆవశ్యమైంది. వీటిని నేర్పటం ద్వారా పిల్లలో ఆలోచనా శక్తి మెరుగుపడుతుంది.

తార్కికశక్తి పెరుగుదల : పిల్లలకు తర్కపరమైన జ్ఞానాన్ని వృద్ధి చెందేలా కృషిచేయాలి. సుడోకో, పదకేళి, పద చదరాలు, సంఖ్యా చదరాలు, పొడువు, విడుపులను నేర్పించటం ద్వారా వారికి తార్కిపరమైన ఆలోచనాశక్తి పెరుగుతుంది. తద్వారా జీవితంలో ఎదురయ్యే ఎంత పెద్ద సమస్యకైనా తార్కిక ఆలోచనా శక్తి దాని ద్వారా పరిష్కరించుకునే సామర్థ్యం అభివృద్ధి చెందుతుంది.

వ్యర్థాలతో పరికరాలు : ఇంట్లో నిరుపయోగంగా ఉన్న వస్తువులతో అందమైన కళాకృతులను రూపొందించటం నేర్పించాలి. పగిలిన గాజులతో దండలుగా తయారుచేయడం, చరవాణిలకు స్టాండులను తయారు చేయటం, అట్టముక్కలతో చిన్న ఆకారాలను గణిత నమూనాలను చేయించటం మంచిది.

ఉద్వేగాల నియంత్రణ : జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను ఎదుర్కోవటానికి ప్రధానంగా మన పిల్లల చేత వైకుంఠపాళీ ఆటను ఆడించటం మంచిది. తద్వారా వారికి గెలుపు ఓటములపై అవగాహన, కష్టం ఎదురైనప్పుడు నిలదొక్కుకోగలిగిన శక్తి, నష్టం ఎదురైనప్పుడు తట్టుకునే ధైర్యం, జీవితంలో ఏదైనా సాధించాలనే ఆసక్తి పెంపొందుతుంది.

శ్రమించే అలవాటు : శ్రమ జీవనాన్ని చిన్నతనం నుంచి అలవాటుగా మార్చాలి. పది సంవత్సరాల దగ్గర పడిన పిల్లలకు వారి దైనందిన కార్యక్రమాలను వారే చేసుకునేలా ప్రోత్సహించాలి. కౌమార దశలోని పిల్లలను అవసరమైతే బయట పనులకు పంపించటం ద్వారా మంచిచెడూ విచక్షణ తెలుస్తుంది. బయట పనులకు పంపటానికి వీలుకాని సందర్భంలో ఇంట్లో తోట పెంపకం పనులనైనా నేర్పాలి. తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉండటంతోపాటుగా ప్రకృతిలో మమేకమవుతారు.

కళలపై ఆసక్తి : సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, కవిత్వం, శిల్పనిర్మాణం వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలి. చక్కని దస్తూరి కోసం చేతిరాత నేర్పించటం, పఠన అవగాహనపై చందమామ, ఇతర కథలను చదివించటం మేలు.

# దోమలు పరార్!



దోమల బెడద పెరగనున్నది. వాటితో వ్యాధుల ముప్పు కూడా రాబోతున్నది. ఈ క్రమంలో బాల్కనీ, టెర్రస్‌పై కొన్నిరకాల మొక్కలను పెంచుకుంటే.. దోమలతో ఇబ్బంది తప్పుతుంది.

వేప: ఎన్నో ఔషధ గుణాలు కలిగిన వేప.. సహజసిద్ధమైన పురుగుమందుగా పనిచేస్తుంది. ఇప్పటికీ ఊళ్లలో దోమలు, క్రిమికీటకాలను తరిమేసేందుకు వేపాకులను కాల్చి.. పొగబెడుతుంటారు. వేపనూనెతోనూ దోమలను తరిమికొట్టొచ్చు. కాబట్టి, మీ పెరటి తోటలో ఓ వేప మొక్కను నాటండి. ఇప్పుడు 'బోన్సాయ్' రూపంలోనూ వేప చెట్లు పెరుగుతున్నాయి. వాటిని బాల్కనీలో పెంచుకోండి.

లావెండర్: ఈ మొక్కల వాసన చాలా ఘాటుగా ఉంటుంది. దోమలను తరిమేస్తుంది. ఇంటి గుమ్మం, కిటికీల దగ్గర లావెండర్ మొక్కలను పెంచితే.. ఇంటికి కొత్త అందం రావడంతోపాటు దోమల బాధ కూడా తప్పుతుంది.

తులసి: వీటి ఆకుల నుంచి సుగంధమైన, ఘాటు వాసనలు వస్తాయి. ఇవి మనిషికి ఆరోగ్యాన్ని అందిస్తే.. దోమలకు అసహ్యంగా ఉంటాయి. అందుకే.. తులసి మొక్క ఉన్నచోట దోమలు వృద్ధిచెందవు. ఓ తులసి మొక్క పెంచడం వల్ల.. ఇల్లు మొత్తం ఔషధ గుణాలతో కూడిన గాలి వ్యాపిస్తుంది. ఆరోగ్యానికీ మేలుచేస్తుంది.

బంతి మొక్క: ఈ మొక్క నుంచి వచ్చే ఘాటు వాసనలు కూడా.. దోమల నిరోధకంగా పనిచేస్తాయి. దోమల మందుల్లోనూ బంతిపూల తైలాలను వాడతారు. అందుకే ఇంట్లో బంతి మొక్క పెంచడం చాలా ఉపయోగకరం.

నిమ్మగడ్డి: దోమలను తరిమికొట్టడంలో నిమ్మగడ్డి అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉండే 'సిట్రోనెల్ల ఆయిల్'.. దోమల నివారణలో ముందుంటుంది. అందుకే.. దోమల మందుల్లోనూ ఈ నూనెను వాడుతారు. ఈ మొక్క ఆకులను కొద్దిగా నూరి.. ఆ వాసన ఇంట్లో వ్యాపించేలా చేస్తే.. దోమలు పారిపోతాయి.



# క్యాల్షియం లోపం.. ఆమెకు శాపం

వయసు పెరుగుతున్న కొద్దీ సాధారణంగానే అందరిలో క్యాల్షియం తగ్గుతుంది. దీంతో ఎముకలు బలహీనపడి,పటుత్వం కోల్పోవడం కూడా సహజమైన విషయమే. కాకపోతే ఈ సమస్య ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో కనిపించేది. ఈ మధ్యకాలంలో మాత్రం చిన్న వయసులోనే.. ముఖ్యంగా స్త్రీలలో ఎముకలు బలహీనంగా మారి కీళ్ల నొప్పులు, నడుం నొప్పి, అలసట వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, వ్యాయామం చేయకపోవడం, సూర్యరశ్మికి దూరంగా ఉండటం, క్యాల్షియం లోపం తదితర కారణాల వల్ల మహిళల్లో ఎముకలు బలహీన పడుతున్నాయి. దీన్నే బోన్‌లాస్ లేదా బోలు ఎముకల వ్యాధి అంటారు. బోన్‌లాస్ వ్యాధి రావడానికి గల ప్రధాన కారణాలు, వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పద్ధతులు, చికిత్స పద్ధతులు మొదలైన అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

ఎముకలు వాటి సాంద్రతను కోల్పోయి పటుత్వం తగ్గిపోతుంది. దీనినే 'బోలు ఎముకల వ్యాధి' లేదా 'బోన్‌లాస్' అంటారు. వైద్య పరిభాషలో 'ఆస్టియోపొరోసిస్' అనికూడా అంటారు. ఈ వ్యాధి పురుషుల కంటే స్త్రీలలోనే అధికంగా కనిపిస్తుంది. మహిళల్లో బోలు ఎముకల వ్యాధి సాధారణంగా సంభవించే వ్యాధిగా పరిగణిస్తారు. దీనికి కారణం రుతుస్రావం ఆగిపోవడం వల్ల హార్మోన్లలో కలిగే మార్పులు. ఎముకలు వాటి సాంద్రతను కోల్పోయి రంధ్రాలమయమై స్పాంజిలా తయారవుతాయి. ఇలా బలహీనపడిపోయిన ఎముకలు పటుత్వం కోల్పోయి విరిగిపోయే అవకాశాలు ఉంటాయి. ఆస్టియోపొరోసిస్ వ్యాధి రెండు రకాలు. ఒకటి ప్రైమరీ ఆస్టియోపొరోసిస్, రెండోది సెకండరీ ఆస్టియోపొరోసిస్.

ప్రైమరీ ఆస్టియోపొరోసిస్: రోగికి ఎలాంటి ఇతర వ్యాధులు లేకున్నా వచ్చే బోన్‌లాస్ వ్యాధిని ప్రైమరీ ఆస్టియోపొరోసిస్ అంటారు. ఇది ఎముక ఏర్పడటం తగ్గిపోవడం, రిసాప్షన్ వల్ల వస్తుంది. ప్రైమరీ ఆస్టియోపొరోసిస్ వ్యాధిని%% 'పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరోసిస్', 'సెనైల్ ఆస్టియోపొరోసిస్' అని రెండు రకాలుగా విభజించారు.

1. పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరోసిస్: ఈ వ్యాధి స్త్రీలలో అధికంగా కనిపిస్తుంది. పోస్ట్ మెనోపాజ్ అంటే మహిళల్లో రుతుస్రావం ఆగిపోవడం. ఈ దశలో కలిగే హార్మోన్ల మార్పిడి వల్ల బోన్ రిసాప్షన్‌కు గురవుతుంది. ఫలితంగా క్యాల్షియం ఎముకలలో నుంచి శరీరంలోకి వచ్చేసి ఎముకలు బలహీనపడతాయి. అంటే ఎముకల్లో ఉన్న క్యాల్షియం నిలువలు తగ్గిపోతాయన్నమాట. సాధారణంగా మహిళల్లో 50 ఏళ్లు దాటుతున్న సమయంలో ఈ దశ మొదలవుతుంది. ఈ వయసులోనే పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరోసిస్ వ్యాధి వచ్చే అవకాశాలు అత్యధికం. ఈ మధ్యకాలంలో కొందరు మహిళలు 50 ఏళ్లలోపే పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరోసిస్‌కు గురవుతున్నారు. కారణాలు: ఈ మధ్యకాలంలో 78 శాతం మహిళల్లో 50 ఏళ్ల వయసు లోపే ఆస్టియోపొరోసిస్ (బోలు ఎముక వ్యాధి), ఆర్థరైటిస్ (కీళ్లనొప్పులు) సమస్యలకు గురవుతున్నారు. దీనికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. మొదటిది స్త్రీలు తమ ఆరోగ్య సంరక్షణపై దృష్టిపెట్టకపోవడం. రెండోది 45- 50 ఏళ్ల మధ్య వయసులోనే రుతుక్రమం ఆగిపోవడం. సాధారణంగా ఈ వయసులో ఈస్ట్రోజన్స్ (స్త్రీల లైంగిక హార్మోన్లు) తగ్గిపోతుంటాయి. ఫలితంగా మెనోపాజ్‌కు దగ్గరవుతున్న (రుతుక్రమానికి దూరమవుతున్న) మహిళల్లో ఎముకలు పటుత్వం కోల్పోయి, బలహీనమవడం తీవ్రమవుతుంది. కొంతమందిలో మాత్రం మెనోపాజ్‌తో సంబంధం లేకుండానే నడివయసులో వివిధ కారణాల వల్ల బోలు ఎముక వ్యాధి వస్తుంటుంది. దానికి కారణాలు%

శరీరంలో క్యాల్షియం తగ్గిపోవడం. డి- విటమిన్ లోపం. తినే ఆహారంలో పోషక విలువలు లేకపోవడం. వ్యాయామం చేయకపోవడం. మద్యపానం, ధూమపానం అలవాట్లు. నియంత్రణలేని థైరాయిడ్, మధుమేహం.

అధికంగా స్టెరాయిడ్స్ వాడటం, ఫిట్స్‌కు యాంటి ఎపిలెప్సి మందులు అధికంగా వాడటం.

2. సెనైల్ ఆస్టియోపొరోసిస్: సెనైల్ ఆస్టియోపొరోసిస్ వ్యాధి వయసుతో ముడిపడి ఉంటుంది. ఇది స్త్రీ, పురుషులు ఇద్దరిలోనూ వస్తుంది. సాధారణంగా మనిషి పుట్టినప్పటి నుంచి వయసు పెరిగే కొద్దీ ఎముకల్లో ఎదుగుదల ఉంటుంది. ఇది 30 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత తగ్గిపోతుంది. ఎముకలు పటిష్ఠంగా ఎదగాలంటే అందుకు సరిపడా డి-విటమిన్, క్యాల్షియం కావాలి. మనం తినే ఆహారం ద్వారా క్యాల్షియం లభిస్తుంది. డి- విటమిన్ సూర్యరశ్మి ద్వారా అధికంగా దొరుకుతుంది. అయితే, 70 ఏళ్ల వయసు వచ్చేసరికి బోన్ ఫార్మేషన్ (ఎముక ఏర్పడే క్రమం) తగ్గిపోతుంది. దీంతో ఎముకలు క్రమంగా బలహీనపడతాయి. ఫలితంగా 70 ఏళ్లు దాటిన వారిలో ఆస్టియోపొరోసిస్ రావడం సహజం. పీక్ బోన్ మాస్‌తో: సెనైల్ ఆస్టియోపొరోసిస్, పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరాసిస్ సమస్యలను అధిగమించాలంటే 'పీక్ బోన్ మాస్' అనేది చాలా కీలకం. పీక్ బోన్ మాస్ అంటే ఎముకల సాంద్రత గరిష్ఠ స్థాయికి చేరుకోవడం. స్త్రీలు, పురుషులు ఇద్దరిలోనూ వయసు పెరిగే కొద్దీ ఎముకలు ఎదుగుతుంటాయి. వాటి నిర్మాణం బలపడుతుంది. 30 ఏళ్ల నాటికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఒక్కమాటలో చెప్పాలంటే 30 ఏళ్ల వయసు వరకు ఎముకల్లో క్యాల్షియం నిల్వలు అధిక మొత్తంలో డిపాజిట్ అవుతుం టాయి. అందుకే ఈ వయసులో ఏర్పడిన ఎముకల ఎదుగుదలను బ్యాంక్ డిపాజిట్‌లా భావిస్తారు. దీనివల్ల ఏర్పడిన ఎముకల పటుత్వం మహిళల్లో మెనోపాజ్ తర్వాత, పురుషుల్లో 70 ఏళ్లు దాటిన తర్వాత ఏర్పడే ఆస్టియోపొరోసిస్ సమస్యను అధిగమిస్తుంది. అంటే సెనైల్ దశలో బోన్ ఫార్మేషన్ తగ్గిపోయినప్పుడు పీక్ బోన్ మాస్ ఉపయోగపడుతుంది అన్నమాట. దీనివల్ల ఆస్టియోపొరోసిస్ బాధ నుంచి తప్పించుకోవచ్చు. పీక్ బోన్ మాస్ ప్రధానంగా నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటుంది.

1. పౌష్టికాహారం, 2. శారీరక శ్రమ, 3. జన్యుపరమైన కారకాలు, 4. గొనాడల్ యాక్టివిటీస్.. అంటే కొన్ని రకాల హార్మోన్ల పనితీరు.

పీక్ బోన్ మాస్ సమృద్ధిగా ఉండాలంటే: వయసు పెరిగేకొద్దీ ఎముకల్లో క్యాల్షియం నిల్వలు అధిక స్థాయిలో జమ అవుతుంటాయి. అతి తక్కువ స్థాయిలో విత్‌డ్రా అవుతాయి. 30 ఏళ్ల వరకు ఇలా జరుగుతుంది. ఆ తర్వాత ఎముకల్లో క్యాల్షియం జమ కావడం క్రమంగా తగ్గుతుంది. విత్‌డ్రా కావడం పెరుగుతుంది. ఎముకల్లో క్యాల్షియం నిల్వలు అధికంగా ఉండాలంటే బాల్య దశ నుంచే పౌష్టికాహారం, సరిపడా క్యాల్షియం అందించే ఆహారంతోపాటు చర్మానికి సూర్యరశ్మి తగిలేలా పిల్లలను రోజూ ఎండలో కనీసం 20 నిమిషాల పాటు ఉంచాలి. దీనివల్ల విటమిన్- డి సమృద్ధిగా లభిస్తుంది. వీటితోపాటు శరీరానికి మంచి వ్యాయామం కల్పించే ఆటలు ఆడిపించాలి. ఫలితంగా 30 ఏళ్లు వచ్చేటప్పటికి వారిలో పీక్ బోన్ మాస్ సమృద్ధిగా ఏర్పడుతుంది. అయితే, సాధారణంగా మహిళల్లో ఈ 'పీక్ బోన్ మాస్' తక్కువగా ఉంటుంది. అందుకే వారు చిన్నతనం నుంచే పౌష్టికాహారంపై ఎక్కువగా దృష్టిపెట్టాలి.

సెనైల్ ఆస్టియోపొరోసిస్ లక్షణాలు: ఇది నిశ్శబ్ద మహమ్మారి (సైలెంట్ ఎపిడెమిక్). ఎముకలు విరిగే వరకు తెలియదు. వెన్నుపూస వంగిపోతుంది.

రోగి ఎత్తు తగ్గిపోతుంది. సెకండరీ ఆస్టియోపొరోసిస్. కొన్ని రకాల జబ్బుల కారణంగా వచ్చే బోలు ఎముకల వ్యాధిని 'సెకండరీ ఆస్టియోపొరోసిస్' అంటారు. లుకేమియా, డయాబెటిస్, ఉదరకుహర వ్యాధి, హైపర్ థైరాయిడిజం, మూత్రపిండ వ్యాధి, అనోరెక్సియా, ఆస్టియోజెనెసిస్, సిస్టిక్ ఫైబ్రోసిస్ వంటి వ్యాధులతో బాధపడే వారికి సెకండరీ ఆస్టియోపొరోసిస్ వచ్చే అవకాశాలు ఎక్కువ. ఈ వ్యాధి పిల్లల్లోనూ కనిపిస్తుంది. పిల్లల్లో కనిపించే దాన్ని 'జువెనైల్ ఆస్టియోపొరోసిస్' అని పిలుస్తారు.

నిర్ధారణ పరీక్షలు: ఆస్టియోపొరోసిస్‌ను గుర్తించేందుకు ముందుగా రోగి ఆరోగ్యస్థితిపై వైద్య పరీక్ష చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత వారి కుటుంబంలో ఎవరికైనా ఈ వ్యాధి ఉందా అనే విషయం తెలుసుకోవాలి. అనంతరం రోగికి 'డెక్సా స్కాన్' ద్వారా ఏ రకమైన ఆస్టియోపొరోసిస్ వచ్చిందో కచ్చితంగా నిర్ధారించవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం ఈ వ్యాధిని టి-స్కోర్ ద్వారా నిర్ధారిస్తారు.

టి- స్కోర్ ప్లస్ 1 నుంచి మైనస్ 1 మధ్యలో ఉంటే అది నార్మల్. వ్యాధి లేనట్టు. టి- స్కోర్ మైనస్ 1 నుంచి మైనస్ 2.5 మధ్యలో ఉంటే ఆస్టియోఫీనియా ఉన్నట్టుగా పరిగణిస్తారు. ఈ దశలోని రోగులకు సులభంగా చికిత్స చేయవచ్చు.

టి- స్కోర్ మైనస్ 2.5 కంటే తక్కువగా ఉంటే వారికి ఆస్టియోపొరోసిస్ వ్యాధి ఉన్నట్టు. టి- స్కోర్ మైనస్ 2.5 కంటే తక్కువగా ఉండి రోగిలో బోన్ ఫ్రాక్చర్ ఉంటే దాన్ని సివియర్ ఆస్టియోపొరోసిస్‌గా పరిగణిస్తారు. అంటే వ్యాధి తీవ్ర దశకు చేరినట్టుగా భావించవచ్చు.

ముందస్తు జాగ్రత్తలు: వయసుకు సరిపడా క్యాల్షియం తీసుకోవాలి. సరిపడా విటమిన్- డి కోసం 20 25 నిమిషాలపాటు చర్మానికి సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. తగినంత వ్యాయామం చేయాలి. లక్షణాలు కనిపించిన వెంటనే సకాలంలో వైద్యులను సంప్రదించాలి. 40 ఏళ్లు దాటిన మహిళలు క్రమం తప్పకుండా ఎముకల ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

చికిత్స పద్ధతి: పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరోసిస్ రోగులకు హార్మోనల్ రీప్లేస్‌మెంట్ థెరపీ (హెచ్‌ఆర్‌టీ) ద్వారా చికిత్స అందిస్తారు. ఇదికాకుండా పారా థైరాయిడ్ హార్మోన్ ద్వారా కూడా చికిత్స అందించవచ్చు. ఈ చికిత్స పోస్ట్ మెనోపాజ్ ఆస్టియోపొరోసిస్‌తో పాటు సెనైల్ ఆస్టియోపొరోసిస్ రోగులకు సైతం ఇవ్వవచ్చు. ఈ చికిత్సలో ఇచ్చే హార్మోన్ల వల్ల ఎముక నుంచి క్యాల్షియం బయటకు పోకుండా అడ్డుకోవడం జరుగుతుంది. ఫలితంగా ఆస్టియోపొరోసిస్‌ను నియంత్రించవచ్చు. ఇది నిశ్శబ్ద మహమ్మారి కాబట్టి,

వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలి. జీవన విధానంలో ఆరోగ్యకరమైన మార్పులు చేసుకోవడం ద్వారా ఆస్టియోపొరోసిస్ ముప్పు తప్పించుకోవచ్చు. ఇలా మొదలవుతుంది: ఎవరిలోనైనా ఎముకల సాంద్రత క్షీణిస్తుంటే వారిలో బోలు ఎముకల వ్యాధి మొదలైనట్టుగా భావించాలి. దీనిని ప్రారంభ దశగా పరిగణిస్తారు. ఎముకలు వెంటనే వాటి సాంద్రతను కోల్పోవు. అందుకు కొంత సమయం పడుతుంది. ఈ దశలో రోగిలో ఎలాంటి లక్షణాలు అంతగా బయటపడవు. ఏదైనా గాయమైనప్పుడో, కిందపడినప్పుడు ఏర్పడినపగుళ్ల వల్లనోవ్యాధిలక్షణాలు బయటపడతాయి.

# రాధా ఫ్రెండ్ షిప్... బూమ్ రాంగ్ అవుతుందా..?




**విజయవాడ,తెలంగాణ దిశ:** ఉమ్మడి ఏపీలో వంగవీటి కుటుంబానికి ఘనమైన చరిత్ర. వంగవీటి మోహన్ రంగా ఒక చరిత్ర సృష్టించారు. ప్రజా సంఘాల నాయకుడిగా విజయవాడలో తనకంటూ ఒక ముద్ర చాటుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే అయ్యింది ఒక్కసారి మాత్రమే అయినా.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయ్యారు. కాపు సామాజిక వర్గానికి అండగా నిలిచారు. అందుకే ఆయన చనిపోయి మూడున్నర దశాబ్దాలు అయినా ఆయన మాత్రం తెలుగు రాజకీయాల్లో సజీవంగా ఉన్నారు. అయితే ఆయన పేరుతో రాజకీయ పార్టీలు లబ్ది పొందుతున్నాయి తప్ప.. ఆయన వారసుడు వంగవీటి రాధాకృష్ణ మాత్రం లాభపడింది తక్కువ. దానికి ఆయన స్వయంకృతాపరాధం ఉంది. మనం తీసుకునే నిర్ణయాలు.. అనుసరించే వ్యూహం బట్టి రాజకీయాల్లో రాణింపు ఉంటుంది. ఈ విషయంలో మాత్రం ఆయన తొందరపాటు చర్యలే ఆయనకు ఈ పరిస్థితికి తెచ్చిపెట్టాయి. 2004లో విద్యార్థి దశలో ఉన్నారు వంగవీటి రాధాకృష్ణ. ఆ సమయంలో పాదయాత్ర చేశారు రాజశేఖర్ రెడ్డి. వంగవీటి మోహన్ రంగ కుమారుడిగా గుర్తించి రాధాకృష్ణను ప్రోత్స హించారు. ఏకంగా అసెంబ్లీ టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచిన రాధాకృష్ణ 3 పదుల వయసు లోనే అసెంబ్లీలో అడుగుపెట్టారు. అందరి దృష్టిని ఆకర్షించగలిగారు. అయితే 2009లో ఆయన చేసిన తప్పిదం శాపంగా మారింది. ప్రజారాజ్యం పార్టీలోకి వెళ్లిపోయారు రాధాకృష్ణ. రాజశేఖర్ రెడ్డి వద్దని వారించినా వినలేదు. ప్రజారాజ్యం పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అదే ఎన్నికల్లో రెండోసారి కాంగ్రెస్ తరపున గెలిచి ఉంటే తప్పకుండా వంగవీటి రాధాకృష్ణ మంత్రి అయ్యేవారు. ఏపీ రాజకీయాల్లో బలమైన శక్తిగా ఎదిగేవారుఅయితే అదే ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్లో విలీనం అయిన వేళ చాలా బాధపడ్డారు రాధాకృష్ణ. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ తరపున 2014 ఎన్నికల్లో పోటీ చేశారు. కానీ ఓడిపోయారు. వైసీపీ సైతం అధికారంలోకి రాలేదు. కనీసం రాధాకృ ష్ణకు గుర్తింపు దక్కలేదు. 2019 ఎన్నికల్లో వైసీపీ టికెట్ లభించలేదు. దీంతో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు రాధాకృష్ణ. అది మొదలు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ వచ్చారు. మొన్నటి ఎన్నికల్లో కూటమి తరుపున ప్రచారం చేశారు. అయితే చంద్రబాబుతో పాటు లోకేష్ రాధాకృష్ణకు మంచి అవకాశం ఇవ్వాలని చూస్తున్నారు. కానీ ఇప్పుడు స్నేహితుల రూపంలో ఆయనకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది.వైసిపి హయాంలో కొడాలి నానితో పాటు వల్లభనేని వంశీ వ్యవహరించిన తీరు అందరికీ తెలిసిందే. వారిద్దరి ప్రవర్తన పై వైసీపీలో సైతం అభ్యంతరాలు ఉన్నాయి. అయితే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు రాధాకృష్ణను ఆ పార్టీలోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినట్లు వార్తలు వచ్చాయి. అదీ జరగలేదు. అయితే ఇప్పుడు రాధాకృష్ణకు మంచి అవకాశాలు దక్కే పరిస్థితి ఉన్న నేపథ్యంలో.. స్నేహం పేరిట వల్లభనేని వంశీతో పాటు నాని ఆయనను కలవడానికి టిడిపి శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నాయి. వైసీపీ హయాంలో అధినేత చంద్రబాబుతో పాటు లోకేష్ ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టిన వ్యక్తులతో వంగవీటి రాధాకృష్ణ ఎలా కలుస్తారని టిడిపి శ్రేణులు ప్రశ్నిస్తున్నాయి. ఒకవైపు రాధాకృష్ణ రాజకీయ ఎదుగుదలకు సరైన నిర్ణయాలు తీసుకోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్న తరుణంలో.. తన కెరీర్ కు ఇబ్బంది కలిగించే స్నేహాన్ని దూరం పెట్టడమే మేలన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. రాజకీయాలు వేరు, స్నేహాలు వేరు అని అనవచ్చు. కానీ విపరీతమైన ధోరణిలతో వ్యవహరించే అటువంటి వారికి దూరంగా ఉండడం చాలా మేలు. ఈ కారణంతో వంగవీటి రాధాకృష్ణ కూటమి ప్రభుత్వంలో పదవి దక్కదు అని చెప్పలేము కానీ.. వీటిపై అభ్యంతరాలు వ్యక్తం చేసేవారు చాలామంది ఉంటారు. ఇక తెలుసుకోవాల్సింది వంగవీటి రాధాకృష్ణ.

# రుషికొండను ఏం చేద్దాం



**విశాఖపట్టణం,తెలంగాణ దిశ:** విశాఖ రుషికొండ భవనాలు మరోసారి చర్చకు వచ్చాయి. ఈ భవనాల వినియోగం విషయంలో ఏపీ ప్రభుత్వం ఎటూ తేల్చుకోలేకపోతోంది. ఇప్పటికే అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతోంది. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన అనివార్య పరిస్థితి ఏపీ ప్రభుత్వానికి ఏర్పడింది. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో 500 కోట్ల రూపాయలతో రుషికొండ భవనాలను నిర్మించారు. కానీ ఎందుకు నిర్మించారో అధికారికంగా ప్రకటించలేదు వైసీపీ ప్రభుత్వం. అయితే అది ముఖ్యమంత్రి పరిపాలన కార్యాలయంగా భావించి నిర్మించారని.. అందులో తప్పు ఏముందని అప్పట్లో వైసీపీ నేతలు ప్రశ్నించేవారు. కానీ ఇప్పుడు దానిపై కనీసం కూడా మాట్లాడడం లేదు.విశాఖలో ల్యాండ్ మార్క్.. విశాఖలో రిషికొండ అనేది ఒక ల్యాండ్ మార్క్. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం. అక్కడ కొండను గుల్ల చేసి పర్యాటక ఆనవాళ్లను తొలగించారు. భారీ భవంతులను నిర్మించారు. పర్యాటక శాఖ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు పూర్తి చేశారు. కానీ ఫలానా కోసం నిర్మాణాలు అని చెప్పలేకపోయారు. పనులు పూర్తి చేసి ప్రారంభించలేకపోయారు. విశాఖ పాలనా రాజధానిగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. అది ముఖ్యమంత్రి కార్యాలయం కోసమేనని అప్పట్లో మంత్రులు ఒకరిద్దరు ప్రకటించారు. కానీ అధికారికంగా ప్రకటించేందుకు అప్పటి వైసిపి ప్రభుత్వం ముందుకు రాలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీ గెలిచి ఉంటే మాత్రం ఆ భవనాల నుంచి ముఖ్యమంత్రి తప్పకుండా ప్రారంభించి ఉండేది అన్నది బహిరంగ రహస్యం.అయితే కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు అవుతోంది. కానీ రుషికొండ భవనాల వినియోగం విషయంలో ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోలేకపోతోంది. మొన్న ఆ మధ్యన సినిమాల చిత్రీకరణతో పాటు సినీ పరిశ్రమకు సంబంధించి ఉపయోగించుకోవాలని ఒక నిర్ణయానికి వచ్చినట్లు ప్రచారం సాగింది. పర్యాటక రంగంలో పేరు మోసిన సంస్థలకు అద్దెకు ఇవ్వాలన్న ప్రతిపాదన కూడా వచ్చింది. ఆపై పర్యాటక అతిథి గృహాలుగా, భారీ ఎగ్జిబిషన్ల నిర్వహణకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్న ప్రతిపాదన లు కూడా వచ్చాయి. కానీ అవేవీ కార్యరూపం దాల్చలేదు.తాజాగా ఈరోజు క్యాబినెట్ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో రుషికొండ భవనాలపై మరోసారి చర్చ జరిగింది. భవనాల నిర్వహణ, విద్యుత్ చార్జీలకు నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చు అవుతుందని.. గతంలో రుషికొండ పర్యాటక ప్రాంతం ద్వారా నెలకు కోటి రూపాయలు ఆదాయం సమకూరేదని మంత్రులు ప్రస్తావించారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిందేనని అభిప్రాయపడ్డారు. ఈ తరుణంలో సీఎం చంద్రబాబు ప్రజాభిప్రాయం కోసం ప్రకటనలు ఇవ్వాలని.. ప్రజలు కోరుకున్న విధంగానే రుషికొండ భవనాలను వినియోగించుకుందామని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి అయితే రుషికొండ భవనాల విషయం అటు తిరిగి ఇటు తిరిగి ప్రజల చేతుల్లోకి వెళ్లడం విశేషం.

# హాట్ స్పాట్ గా ఉపఎన్నిక




**హైదరాబాద్,తెలంగాణ దిశ:** తెలంగాణ రాజధాని విశ్వనగరం హైదరాబాద్‌లోని కీలకమైన జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నిక రాజకీయంగా హాట్‌స్పాట్‌గా మారింది. సిట్టింగ్ సీటు నిలబెట్టుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. తన ఖాతాలో వేసుకోవాలని అధికార కాంగ్రెస్ తహతహలాడుతోంది. రాజాసింగ్ పార్టీని వీడిన నేపథ్యంలో జూబ్లీ హిల్స్‌లో కాషాయ జెండ ఎగరేసి తెలంగాణలో బీజేపీ బలంగా ఉందని నిరూపించాలని కమలనాథులు ఉబలాటపడుతున్నారు. గెలుపు కోసం సర్వం సిద్ధం చేసుకున్నారు. వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నారు. రాబోయే నవంబర్ 11 పోలింగ్‌తో ఈ పోరు ఒకే నియోజకవర్గం వరకే కాక, నగర రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపనుంది.మాజీ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో ఖాళీ అయిన స్థానాన్ని దక్కించుకోవటానికి బీఆర్ఎస్ ఆయన భార్య సునీతను బరిలోకి దింపింది. కుటుంబ వారసత్వం, సానుభూతి ఓట్లు బలంగా ఉన్నప్పటికీ అనుభవలేమి, ప్రతిపక్ష రాజకీయాల్లో అడ్వాంటేజ్ సృష్టించుకోవడం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. పార్టీ అగ్రనేతల మద్దతుతో ఈ సీటు నిలబెట్టుకోవడం బీఆర్ఎస్‌కు ప్రాణాధారమవుతుంది.ఇక అధికార కాంగ్రెస్ అధికార బలంతోపాటు బీసీ కమ్యూనిటీకి చెందిన స్థానిక నేత నవీన్ యాదవ్‌ను అభ్యర్థిగా ఎంపికచేసింది.స్థానిక అనుబంధాలనుసద్వినియోగంచేసుకునే వ్యూహం ఎంచుకుంది. ఆయన తండ్రి శ్రీశైలం యాదవ్‌కు ఉన్న పాత రాజకీయ బలం కూడా అదనపు మద్దతు ఇవ్వవచ్చు. అయితే పాత కాంగ్రెస్ వర్గాలు, పీజేఆర్ అభిమానులు ఇప్పుడు ఎటు మళ్లుతారన్నది కీలకం. అభ్యర్థి వేటలో బీజేపీ..: ఇక 2023 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసిన దీపక్‌రెడ్డికి మరో ఛాన్స్ ఇవ్వాలా లేక కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాలా అనే విషయంలో బీజేపీ ఉంది. ఈ ప్రాంతంలో ఆంధ్రా సెటిలర్ల సంఖ్య ఎక్కువగా ఉండటం, ఏపీ టీడీపీ తో వివాదరహిత సంబంధాలు ఉండటం బీజేపీకి బలాన్నిస్తుందని భావిస్తున్నారు. అయితే సుమారు 1.4 లక్షల మైనారిటీ ఓటర్ల ప్రాధాన్యం, వారి ఓటు విభజన లేదా సమీకరణ బీజేపీ గెలుపు సమీకరణాన్ని ప్రభావితం చేసే అంశం. ఫలితంపై ప్రభావం చూపే కీలక అంశాలు: మైనారిటీ ఓటు ఎటు ఒక్కటవుతుందో. సానుభూతి తరహా ఓటు ఎంతవరకు బీఆర్ఎస్‌కు ఉపయోగపడుతుందో. స్థానిక బీసీ అభ్యర్థి ప్రభావం కాగ్రెస్‌కు ఎంత బలాన్నిస్తుందో. బీజేపీ టికెట్ ఎంపిక, ఆంధ్రా సెటిలర్ మరియు హిందూ ఓటు బేస్ సమీకరణగత ఎన్నికల ఫలితాలు ఇలా..: 2023 ఎన్నికల్లో మాగంటి గోపీనాథ్ (బీఆర్ఎస్) 80,549 ఓట్లు గెలిచి, కాంగ్రెస్ అభ్యర్థి మోహమ్మద్ అజరుద్దీన్ 64,212 ఓట్లు పొందారు. బీజేపీ దీపక్ రెడ్డి 25,866 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ నియోజకవర్గంలో సుమారు 3.85లక్షల మంది ఓటర్లు ఉండగా,మైనారిటీల సంఖ్య 1.20 లక్షలకి పైగా ఉంది. ఈ మైనారిటీ ఓటర్లు ఏ పార్టీకి వస్తే ఫలితం ఆ ఆర్టీకే అనుకూలంగా ఉంటుంది. బీఆర్ఎస్ సునీత ఆధారంగా సానుభూతి ఓట్లు ఆశించగా, అనుభవ లేమితో కూడిన సవాళ్లు ఎదుర్కొంటోంది. కాంగ్రెస్ నవీన్ యాదవ్ స్థానిక ఉద్యమానికి బలం ఇచ్చే ప్రయత్నంలో ఉంది. బీజేపీ అభ్యర్థి ఎంపిక వేగంగా చేయకపోవడం, మైనారిటీ ఓట్ల విభజన సమస్యలు తదితర అంశాలు దృష్టిలో ఉన్నాయి.

# కమలంలో వినిపించని సౌండ్!

**ఏలూరు,తెలంగాణ దిశ:** ఏపీ బీజేపీలో ఏ స్వరాలూ? వినిపించడం లేదు ఎందుకు? పార్టీలో పూర్తిస్థాయి స్తబ్దత పెరిగిపోవడానికి కారణాలేంటి? చివరికి అధికార ప్రతినిధులు కూడా అధికారికంగా ఎందుకు మాట్లాడలేక పోతున్నారు? వాళ్ళ గొంతులకు అడ్డుపడుతున్నదేంటి? ఎంత అధికార కూటమిలో భాగస్వామి అయినా? కనీసమైన రాజకీయ స్పందనలు కరవవడానికి కారణాలేంటి? ఏపీ బీజేపీలో ఎవ్వరూ సౌండ్ చేయడం లేదు. పార్టీ అధికార ప్రతినిధులైతే? అసలే మాట్లాడ్డం లేదు. స్పందించాల్సిన, నోరు తెరవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి. కానీ అంతా చూద్దాం? చేద్దాం అన్నట్టు నిర్లిప్తంగా ఉంటున్నారట. ఈ తీరు క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను అయోమయంలోకి నెడుతోందన్న చర్చ నడుస్తోంది పార్టీ సర్కిల్స్‌లో. ఎవరి సంగతి ఎలాఉన్నా? కనీసం అధికార ప్రతినిధులైనా మాట్లాడాలి కదా..? వాళ్ళెందుకు రియాక్ట్ అవడం లేదు? అలా ఎందుకు జరుగుతోందని ఆరా తీస్తే? అంతా అధ్యక్షులవారి మహిమ అన్న సమాధానం వస్తోందట. మేం కూడా మా అధ్యక్షుడిని ఫాలో అయిపోతున్నాంలే. ఆయనగారికి లేని దురద మాకెందుకంటూ సన్నిహితుల దగ్గర అంటున్నట్టు సమాచారం. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవే ఏ విషయంలోనూ ఓపెన్‌గా మాట్లాడ్డం లేదు? ఇక మేమేం నోరు తెరుస్తామని అంటున్నట్టు సమాచారం. మాధవ్ ఎప్పటికప్పుడు సిద్ధాంతాల గురించి చెప్పడమే తప్ప?క్షేత్ర స్థాయిలో రాజకీయ కార్యాచరణపై దృష్టి పెట్టడం లేదన్న అసంతృప్తి ఉందట ఏపీ బీజేపీ వర్గాల్లో. ఆయన జిల్లాల పర్యటనల్లో కూడా సిద్ధాంత పరమైన చర్చలే తప్ప? రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడం, రాజకీయంగా ఉనికి చాటుకోవడం లాంటి అంశాల మీద




దృష్టి సారించడం లేదని చెప్పుకుంటున్నారు. ఇటీవల కూటమి కార్యక్రమాల్లో సైతం ఆయన ఫాలోయర్‌లా కనిపిస్తున్నారే తప్ప? రాష్ట్ర అధ్యక్షుడిగా బీజేపీ వాయిస్ వినిపించడంలో వెనకబడుతున్నారన్న అభిప్రాయం బలపడుతోందట. ఆయన ఎందుకు అలా ఉంటున్నారో తెలీక పార్టీ మిగతా నేతలు సతమతం అవుతున్నట్టు సమాచారం. కేంద్రం ఏదైనా కార్యక్రమానికి పిలుపునిస్తేనో, పథకం ప్రారంభిస్తేనో తప్ప? రాష్ట్ర పార్టీకంటూ ప్రత్యేక కార్యాచరణ లేకుండా పోయిందని, అదే పెద్ద మైనస్ అన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది కేడర్‌లో. రాష్ట్ర ప్రజలు ఏం కోరుకుంటున్నారో, అధికార కూటమి భాగస్వామిగా తామేం చేయాలో కూడా క్లారిటీ లేకుండా పోయిందని, ఇదంతా అధ్యక్షుడి ఉదాసీనత వల్లేనన్న చర్చ జరుగుతోందట కమలం వర్గాల్లో. ఏపీ బీజేపీ అధ్యక్షుడు స్పీడు పెంచకపోతే క్షేత్రస్థాయి బలోపేతం కావడం సంగతి తర్వాత? ఉన్న అరకొర బలం కూడా తుడిచిపెట్టుకు పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు కార్యకర్తలు.

## జల దిగ్బంధంలో కొమ్మేపల్లి గిరిజన గురుకుల పాఠశాల

**దేవరకొండ,తెలంగాణ దిశ:** భారీ వర్షానికి దేవరకొండ రూరల్ మండలంలోని కొంమేపల్లి గ్రామంలో గల గిరిజన గురు కుల పాఠశాల జలదిగ్బంధంలో చిక్కుకుంది. చుట్టూ వర్షం నీరు చేరి జలమయమైంది. పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గత రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని తాటికోల్‌తో పాటు పలు గ్రామాల వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు ఇబ్బందిగా మారాయి.



# చేపలను మింగుతున్న కాలుష్యం !

పరిశ్రమల కాలుష్యం నదులను, చెరువులను, చివరకు సముద్రాన్ని కూడా కలుషితం చేస్తోంది. మన జీవితాలు ఏమయితేనేమి అన్న ధోరణిలో పరిశ్రమల యజమానులు కాలుష్యాన్ని విచ్చలవిడిగా వెదజల్లుతున్నారు. ఒకప్పుడు పటాన్ చెరువు కాలుష్యంపే ఏళ్లుగా పోరాటాలు జరిగాయి. తరవాత ఎల్బినగర్ సిరిస్ కంపెనీ కాలుష్యంపైనా పోరాటాలు సాగాయి. హుస్సేన్ సాగర్ కాలుష్యం అలాగే ఉండిపోయింది. కొబ్బరినీళ్లలా హుస్సేన్ సాగర్ నీళ్లను చేస్తానన్న కెసిఆర్ కూడా పట్టించుకోలేదు. ఢిల్లీ కాలుష్యంపై సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరించినా అడుగులు పడడం లేదు. ఇప్పుడు ఉప్పాడ కాలుష్యం పై మత్స్యకారులు పోరాటం చేస్తున్నారు. దీనిపై డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ గట్టిగానే స్పందించారు. అయితే ఆయన పట్టుదల ఎంతవరకు అన్నది తేలాల్సి ఉంది. పట్టుదలతో కాలుష్యాన్ని అరికట్టగలిగితే చిరస్థాయిగా నిలిచిపోతారు. సముద్రాన్ని కాపాడుకున్నవారం అవుతాం. అలాగే విశాఖలో సముద్రజలాల కాలుష్యం కూడా ఇంతకుమించి ఉంది. వీటిపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కాకినాడ జిల్లాలో ఉన్న పారిశ్రామిక కాలుష్యం, మైనింగ్ మూలంగా తలెత్తుతున్న కాలుష్య ఇబ్బందులపై కాలుష్య నియతం÷–రణ అధికారులతో పవన్ కళ్యాణ్ చర్చించారు. కాకినాడలో చేపట్టిన మత్స్యకారులతో మాట..మంతిలో మత్స్యకారులు ప్రస్తావించిన అంశాలు, వారి సందేహాలపై పీసీబీ నుంచి వివరాలు తీసుకున్నారు. పొల్యూషన్ ఆడిట్‌కి అనుసరించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కాకినాడ జిల్లాతోపాటు గోదావరి జిల్లాల్లో ఉన్న కాలుష్య పరిస్థితులు, పర్యావరణ పరిరక్షణపై వివరాలు అడిగి పవన్ కల్యాణ్ తెలుసుకున్నారు. దీనిపై ఎలాంటి అడుగులు వేస్తారన్నది ఇప్పుడు అందరి దృష్టి ఉంది. నిజానికి ఉప్పాడ తీరంలో ఉంటున్న వారంతా సముద్రాన్నే నమ్ముకుని చేపల వేట ద్వారా కుటుంబాలను పోషించుకుంటున్న మత్స్యకారులు. ఏళ్ల తరబడి వేటే ఆధారంగా జీవిస్తున్నారు. వీరి ఉపాధికి ఫార్మా కంపెనీలు గండి కొడుతున్నాయి. ఈ పరిశ్రమల వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతుండడంతో



చేపల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం పడుతోంది. కాకినాడ జిల్లా కెఎస్ఇజడ్ పరిధిలో లైఫిజ్, అరబిందో ఫార్మా కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెట్టేందుకు యు.కొత్తపల్లి మండలంలో కోనపాపపేట, తొండంగి మండలం పెరుమల్లపురం మధ్యలో మూడు కిలోమీటర్ల పొడవున భారీ పైపు లైన్‌ను రెండేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఫార్మా వ్యర్థాలు, విషపూరిత జలాలను శుద్ధి చేయకుండా సముద్రంలోకి నేరుగా విడుదల చేస్తున్నారు. అరబిందో పరిశ్రమ నుంచి కూడా భారీ పైపులైను ద్వారా వ్యర్థాలను సముద్రంలోకి విడిచి పెడుతున్నారు. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది.

నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. ఫార్మా కంపెనీలు, తీర ప్రాంతానికి ఆనుకుని ఉన్న హేచరీల ద్వారా రసాయనిక జలాలు, ఇతర వ్యర్థాలు సముద్రంలోకి వదిలేస్తున్నారు. దీనివల్ల చేపలు దూరంగా వెళ్లిపోయాయి. కొన్ని చేపలు చనిపోతున్నాయి. పరిశ్రమల కాలుష్యంపై వైసిపి హయాం నుంచీ పోరాటం చేస్తున్నారు.. ఎవరూ పట్టించుకోవట్లేదు. ప్రభుత్వం మారిన తర్వాతైనా న్యాయం జరుగుతుందని ఆశించారు. వ్యర్థాలను శుద్ధి చేసిన తర్వాతే వ్యర్థాలను సముద్రంలోకి వదలాలని కోరుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ నుంచి తొండంగి మండలం అద్దారిపేట వరకు సుమారు 32 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. ఈ రెండు మండలాల్లో 18 గ్రామాలకు చెందిన దాదాపు 50 వేల మంది మత్స్యకారులు చేపల వేటే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. ఫార్మా కంపెనీల వ్యర్థాల వల్ల చేపలు చనిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారు.

## పాఠశాల బాత్రూంలో
# బాలికపై లైంగిక దాడి



జైపూర్ : రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని ఓ పాఠశాలలో ఏడేళ్ల బాలికపై జరిగిన లైంగికదాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాల బాత్రూంలో దాక్కున్న ఓ దుండగుడు ఈ దారుణానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఈ దారుణం చోటుచేసుకుంది. నిందితుడు పాఠశాల ప్రహరీ దూకి లోపలికి ప్రవేశించాడు. నేరుగా టాయిలెట్‌లోకి వెళ్లి అక్కడ దాక్కున్నాడు. కాసేపటికి బాత్రూంకి వచ్చిన బాలికపై లైంగికదాడికి పాల్పడి, వచ్చిన దారిలోనే గోడ దూకి పారిపోయాడు. భయంతో వణికిపోయిన ఆ చిన్నారి, జరిగిన దారుణాన్ని టీచర్లకు చెప్పడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంతో పాటు లైంగికదాడి కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు, పాఠశాల గోడ సమీపంలో నివసించే ఓ వ్యక్తిపై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడిని విచారిస్తున్నామని, ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని స్థానిక పోలీస్ అధికారి తెలిపారు.

# టోల్‌ను ఎగవేస్తున్న ఇసుక లారీలు



**జగ్గంపేట(కాకినాడ),తెలంగాణ దిశ:** కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌చార్జెస్‌ను ఎగవేస్తూ ఇసుకను రవాణాను చేస్తున్నారు. భారీ వాహనాల్లో ఇసుకను బూరుగుపూడి నుంచి పోలవరం కాలువ మీదుగా సుమారుగా 2 కిలో మీటర్లు ప్రయాణించి హైవే ఎక్కుతున్నారు. దీంతో టోల్ ప్లాజా చెల్లించాల్సిన సొమ్ములు చెల్లించకుండానే ఇసుక రవాణా చేస్తున్నారు. ఈ వ్యవహారంపై స్థానిక రైతులు టోల్ ప్లాజా నిర్వాహకులకు ఫిర్యాదు చేయడంతో మూడు నెలల క్రితం నేషనల్ హైవే ఆథారిటి సిబ్బంది హైట్ బారియర్స్ వేసి మార్గాన్ని మూసేశారు. గుర్తు తెలియని వ్యక్తులు జెసిబితో హైట్ బారియర్ తొలగించి ఇసుక రవాణాను ప్రారంభించారు.

# పేట బ్రదర్స్ ఆధ్వర్యంలో గిరిజన పిల్లలకు దుస్తులు పంపిణీ



**తోట్టంబేడు,తెలంగాణ దిశ:** జనసేన పర్యటనలో భాగంగా తొట్టంబేడు మండలం పొయ్య పంచాయతీలోని ఎస్టీ కాలనీలో అక్కడున్న గిరిజనులు 50 మందికి పైగా చిన్నపిల్లలు ఉన్నారని వాళ్లకి దుస్తులు ఏర్పాటు చేస్తే బాగుంటుందనిఅక్కడ ప్రజలు కోరుకోవడం జరిగింది , పేట బ్రదర్స్ మిత్ర బృందం ఆధ్వర్యంలో వాళ్ల కోసం స్వయంగా కాలనీకి వెళ్లి అక్కడున్నపిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు.పిల్లలు మరియు తల్లిద ండ్రులు చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గంధం శ్రీను, మనీ, డాక్టర్ నక్క ప్రసాద్, ఆరిఫ్, మహేష్, ప్రదీప్ కుమార్, నవీన్, మహేష్, దినేష్, కల్లిపూడి వెంకటేష్, రమేష్ బాబు, ముని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం..

జనగామ : అకాల వర్షం అన్నదాతలకు కన్నీళ్లను మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయంలో నేలపాయింది. జనగామవ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి తెచ్చిన ధాన్యం అకాల వర్షానికి తడిసి ముద్దయింది. పండించిన పంట కళ్లముందే వర్షపు నీటిలో కొట్టుకొని పోవడం చూసి రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. 25 నుండి 30 లారీల వరి ధాన్యాన్ని కుప్పలుగా పోసి వారం పైన నుండి ఆశతో ఎదురు చూస్తున్న రైతుల ఆశలపై అకాల వర్షం నీళ్లు చల్లింది. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఆరంభించి తడిసిన ధాన్యాన్ని రైతుల వద్ద నుండి ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# మోహన్ బాబు స్టోరీలో అదే నీతా.. కర్మ రిటర్న్




**తిరుపతి,తెలంగాణ దిశ:** కర్మ రిటర్న్ అన్న సిద్ధాంతం సినీ నటుడు మోహన్‌బాబుకు అతికినట్టు సరిపోతుందన్న అభిప్రాయం బలపడుతోంది వివిధ వర్గాల్లో. బాబూ? మోహన్ బాబూ రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవయ్యా?. ఇక కాస్కో అని ఏపీ ప్రభుత్వ పెద్దలు కూడా సంకేతాలు పంపుతున్నట్టు అంచనా వేస్తున్నారు తాజా పరిస్థితుల్ని దగ్గరగా గమనిస్తున్న వాళ్ళు. ఇక అసలు విషయానికొస్తే?.. దాదాపు దశాబ్దానికి పైగా టీడీపీ అధినేత చంద్రబాబు, మోహన్ బాబు మధ్య మాటల్లేవ్. గతంలో తెలుగుదేశం పార్టీకి సొంత మనిషిలా ఉండే మోహన్ బాబు?ఆ తర్వాత రకరకాల కారణాలతో దూరమై చాలా కాలంగా పార్టీతో, చంద్రబాబుతో విభేదిస్తున్నారు. ఆ క్రమంలోనే? 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైసీపీకి జై కొట్టారాయన. అదే ఊపులో అప్పుడు సీఎం చంద్రబాబును గట్టిగా టార్గెట్ చేశారు.ఇంకా చెప్పాలంటేనాడు టీడీపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేశారన్నది ఎక్కువ మంది అభిప్రాయం. కానీ? వైసీపీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీతో కూడా టచ్ మీ నాట్ అన్నట్లుగానే ఉన్నారు. అందుకు కారణాలు కూడా చాలానే ఉన్నాయట. తాను కోరుకున్న ఫ్యాన్ పార్టీ అధికారంలోకి రాగానే టీటీడీ ఛైర్మన్ లేదా రాజ్యసభ సీటు ఆశించారట మోహన్‌బాబు. ఆ రెండూ కాకున్నా? చివరికి ఫిలిం డెవలప్ మెంట్ బోర్డు ఛైర్మన్ పదవి అయినా కావాలని తెగ ఆరాటపడ్డారట అప్పట్లో. కానీ? నో యూజ్. ఏ పదవీ దక్కలేదు. పైగా అంతకు ముందు టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు ఏ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ బకాయిల కోసమైతే? తాను విద్యార్థులతో కలిసి రోడ్డెక్కారో? ఆ బకాయిల్ని కూడా పూర్తి స్థాయిలో ఇప్పించుకోలేక ఛీ ఇదా నా పరిస్థితి అంటూ చతికిలపడ్డారట పెదరాయుడు. జగన్ దగ్గర నా పరపతి అరచేతి మందాన ఉందని గొప్పలకు పోయిన మోహన్‌బాబుకు చివరికి తత్వం బోధపడి మెల్లిగా బీజేపీకి దగ్గరైనట్టు చెప్పుకుంటారు. తన విద్యా సంస్థలకు ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ విషయంలో 2019 ఎన్నికలకు ముందు మోహన్ బాబు చేసిన హంగామా అంతా ఇంతా కాదు.నాటి టీడీపీ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ?.విద్యార్థులతో కలిసి నడి రోడ్డు మీద కూర్చుని మోహన్‌బాబు చేసిన రచ్చ అంతా ఇంతా కాదు. ఆ విషయాన్ని ఇప్పటికీ గుర్తు చేసుకుని ఫైరైపోతుంటారు తమ్ముళ్ళు. ఆ ఎపిసోడ్‌లో ప్రతిపక్షంగా వైసీపీ చేసిన హడావిడికంటే?మోహన్‌బాబే చాలా ఎక్కువ చేశారన్న అభిప్రాయం ఇప్పటికీ బలంగా ఉందట ఉమ్మడి చిత్తూరు జిల్లా తెలుగుదేశం కేడర్‌లో. అందుకే ప్రస్తుతం ఆయన తమ మిత్రపక్షం బీజేపీకి దగ్గరైనా? సంబంధంలేని వ్యక్తిగానే చూస్తుంటారు. అదే సమయంలో మోహన్‌బాబు విషయంలో సీఎం చంద్రబాబు మెతక వైఖరి అవలంభిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసే టీడీపీ లీడర్స్‌కు కూడా కొదవ లేదు. చంద్రబాబు వైఖరి వల్లే? ఛాన్స్ దొరికినప్పుడల్లా మోహన్ బాబు టీడీపీ మీద విషం చిమ్ముతూ ఉంటారని బహిరంగంగానే విమర్శిస్తుంటారు తమ్ముళ్ళు. కానీ? అదంతా పాత లెక్క అని చెబుతున్నాయట తాజా పరిణామాలు. పెదరాయుడికి ఊహించని షాక్ ఇచ్చింది ఏపీ ప్రభుత్వం. ఇది చూసిన కొందరు టీడీపీ కార్యకర్తలు అవునా? నిజమా? అని ముక్కున వేలేసుకుంటుంటే? ఇంకొందరు మాత్రం ఓ అడుగు ముందుకేసి ఇప్పటిదాకా ఒక లెక్క, ఇక నుంచి మరో లెక్క అంటూ సినిమా డైలాగ్స్ చెప్పేస్తున్నారటగతంలో ఏ ఫీజు రీ ఇంబర్స్‌మెంట్ కోసం రోడ్డెక్కి చంద్రబాబు, టీడీపీ మీద పెద్ద ఎత్తున విమర్శలు చేశారో? అవే నిధులు, కాలేజ్ ఫీజుల మళ్ళింపు వ్యవహారంలో ఇప్పుడు మోహన్‌బాబు ఇరుక్కోవడం చూసి కర్మ రిటర్న్ అంటే ఇదేనంటూ కామెంట్స్ చేస్తున్నారు టీడీపీ కార్యకర్తలు. మోహన్‌బాబు యూనివర్శిటీలో తమ దగ్గర అడ్డసుడిగా డబ్బులు పిండుకుంటున్నారంటూ.. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణకు ఆదేశించింది ఉన్నత విద్యామండలి. విచారణ తర్వాత కాలేజీ మూసివేత, 15 లక్షల రూపాయల ఫైన్ తో పాటు విద్యార్థుల నుంచి వసూలు చేసిన అదనపు సొమ్ము 26 కోట్ల రూపాయలను 15 రోజుల లోపు తిరిగి చెల్లించాలని చెప్పడం మోహన్‌బాబు ఊహించని షాకేనంటున్నారు. దీంతో అవాక్కయిన టీడీపీ కేడర్? ఇది నిజంగా మన ప్రభుత్వమేనా? అలాంటి చర్యలకు ఆదేశించింది నిజమేనా అంటూ తమను తాము గిల్లి చూసుకుంటున్నారట. కొద్దిమంది చిత్తూరు జిల్లా సీనియర్స్ అయితే? ఈ విషయంలో చంద్రబాబు ప్రమేయం పెద్దగా ఉండకపోవచ్చని, అంతకు మించి లోకేష్ పూనుకుని గట్టిగా వ్యవహరించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. తప్పును తప్పు అని చెప్పడానికి కూడా భయపడాల్సిన అవసరం లేదని, లోకేష్ ఆదేశాలతోనే ఉన్నత విద్యా మండలి స్వేచ్ఛగా విచారణ జరిపి ఈ తరహాలో కఠిన నిర్ణయం తీసుకుందన్న అభిప్రాయం ఉంది సీనియర్స్‌లో. మోహన్ బాబు గతంలో ఎలా వ్యవహరించాడో? అందరికీ తెలుసు కాబట్టే?. లోకేష్ తండ్రిలా కాకుండా ?. ఛాన్స్ దొరికింది కాబట్టి ఓ ఆటాడేసుకుంటున్నారన్న చర్చ గట్టిగా జరుగుతోంది జిల్లాలోదానికి తోడు మోహన్ బాబు రెండో కుమారుడు మంచు మనోజ్ సైతం నేరుగా లోకేష్‌ను పలుమార్లు కలిసి తనతో నాన్న, అన్న ఎలా వ్యవహరించారో వివరించారట. కారణాలు ఏవైనాగానీ?. మోహన్‌బాబు విషయంలో చంద్రబాబులాగా కాకుండా?. లోకేష్ గట్టిగా నిర్ణయాలు తీసుకున్నారంటూ? ఉమ్మడి చిత్తూరు టీడీపీ కేడర్ ఖుషీగా ఉన్నట్టు సమాచారం. ఇదే విషయాన్ని సోషల్ మీడియా వేదికగా చర్చకు పెట్టేస్తున్నారు. మన్తో ఎంటర్‌టైన్‌మెంట్ మామూలుగా ఉండదు మరి అంటున్నారు టీడీపీ లీడర్స్. చినబాబు యాక్షన్‌కు పెదరాయుడు రియాక్షన్ ఎలా ఉంటుందోనని ఆసక్తిగా గమనిస్తున్నాయి రాజకీవర్గాలు.

## మెగా జాబ్ మేళాకు విశేషా స్పందన



శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి టీడీపీ కార్యాలయం లో శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు ఆద్విక ఎంటర్ప్రైజెస్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని ఎంపికైన నిరుద్యోగులకు నియామక పత్రాలను బొజ్జల బృందమ్మ అందజేశారు.

అనంతరం బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ బొజ్జల సుధీర్ రెడ్డి నిరుద్యోగ యువత కు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నిక

### నాలుగో సారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా చల్లా చెంచు రత్నం యాదవ్ ఏకగ్రీవ ఎన్నిక



**శ్రీకాళహస్తి,తెలంగాణ దిశ:** ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు చిత్తూరులో జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాల్ నందు నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులుగా శశిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాలుగోసారి, చల్లా చెంచురత్నం యాదవ్ మరియు కోశాధికారిగా నాలుగోసారి చంద్రశేఖర్ రెడ్డి , రాష్ట్ర కౌన్సిలర్ గా లక్ష్మీపతి యాదవ్, గిరిధర్ రెడ్డి ,చక్రపాణి, త్రివిక్రమ రావు,ఉపాధ్యక్షులుగా పి మూర్తి, వాణి ,లోకేష్, కుమార్ ,సంయుక్త కార్యదర్శిగా ఆలీ, లక్ష్మీనారాయణ , రాష్ట్ర కౌన్సిలర్ గా తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చెంచురత్నం యాదవ్ మాట్లాడుతూ నన్ను నాలుగో సారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు ఉద్యోగస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా భవిష్యత్తులో పంచాయతీరాజ్ మినిస్ట్రీలు ఎంప్లాయిస్ కి సంబంధించి ఏ విషయమైనా ప్రభుత్వంతో మాట్లాడి సంవత్సరము పరిష్కరి విధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం చెంచురత్నం యాదవ్ ను పలువురు పంచాయతీరాజ్ ఉద్యోగులు అభినందనలు తెలియజేసి సన్మానం చేశారు.

# లీడర్లు సరే... కేడర్ సంగతేంటీ

**విజయవాడ,తెలంగాణ దిశ:**ఇటీవలి రోజులలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు టీడీపీ , జనసేన పార్టీల మధ్య సంబంధాలపై చర్చనీయాంసంగా మారాయి. ముఖ్యంగా అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య స్వల్ప ఉద్రిక్తతకు దారి తీశాయి. ఈ సంఘటనలతో క్షేత్రస్థాయిలో ఉన్న నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, సోషల్ మీడియాలో దూషణలకు దిగడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ ఉద్రిక్తతలు పైస్థాయిలో అంతగా ప్రభావం చూపలేదని చెప్పాలి.అయితే అగ్రనేతల స్థాయిలో మాత్రం సమన్వయం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం బాగాలేదని తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి దాదాపు నలభై నిమిషాలు సమావేశం కావడం, చర్చలు జరపడం రెండు పార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని చూపించింది. దీంతో తాత్కాలికంగా ఉన్న ఉద్రిక్తతలు చల్లారినట్లు కనిపించాయి. పై స్థాయిలో ఇద్దరు నాయకులు పరస్పర గౌరవం, అవగాహనతో ముందుకు సాగుతున్నారు.విజయవాడ లో జరిగిన "ఆటో డ్రైవర్ల సేవలో" అనే కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇద్దరూ పాల్గొని ఒకే వేదికపై కనిపించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించడం, ఆయన సారథ్యంలో రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పడం కూడా రెండు పార్టీల మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరిచింది. దీని ద్వారా అగ్ర నాయకుల మధ్య పెద్ద విభేదాలు లేవని స్పష్టమవుతోంది.అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకులు, దానికి వ్యతిరేకంగా స్పందించిన జనసేన నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. చిరంజీవి పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తప్పు అంటున్న జనసేన నాయకులు ఎక్కువగా ఉన్నారు. ఈ కారణంగా కొన్ని నియోజకవర్గాల్లో రెండు పార్టీల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే నష్టం క్షేత్రస్థాయి నాయకులకే జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇక రాబోయే ఎన్నికల దృష్ట్యా రెండు పార్టీలూ తమ బలం పెంపుపై దృష్టి సారిస్తున్నాయి. జనసేన పార్టీ నూతన నాయకులను ముందుకు తెచ్చే ప్రయత్నంలో ఉండగా, టీడీపీ మాత్రం ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాలని చూస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ అంతర్గత విభేదాలు నాయకులకు ఇబ్బందులు తెచ్చే అవకాశం ఉంది. అగ్ర నాయకులు పరస్పర అవగాహనతో ముందుకు సాగుతున్న సమయంలో, క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే పార్టీ బలహీనపడడమే కాకుండా, వారి రాజకీయ భవిష్యత్తుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

# కుల సంఘాల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలు చేపట్టాలి

## -గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్



**జయశంకర్ భూపాలపల్లి,తెలంగాణ దిశ:**బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లను ఒప్పించి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గౌడ కులస్తులకు,1ఎకరం భూమి మరియు గౌడ కులస్తుల సంక్షేమార్థం కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం కోసం కోటి రూపాయల నిధులను కేటాయించడం జరిగిందని అట్టి పనులను వెంటనే చేపట్టాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బుర్ర రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2023లో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఒత్తిడి మేరకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కృష్ణ కాలనీలో 25కుల సంఘాలకు 25 ఎకరాల భూమిని కేటాయించి, కుల సంఘాల కమ్యూనిటీ హాల్ భవనాలను మంజూరు చేసి, 25 కుల సంఘాల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలకునిధులను కేటాయించగా..నాటి కలెక్టర్ భవేష్ మిశ్రా, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డిలు వాటికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కుల సంఘాలకు అందజేశారన్నారు. కానీ ప్రభుత్వం మారిన వెంటనే కుల సంఘాల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాలకుజరగాల్సిన పనులు జరగడంలేదన్నారు. నాటి కలెక్టర్ భవేష్ మిశ్రా ఇచ్చినప్రొసీడింగ్స్ ఆధారంగా ప్రస్తుత జిల్లా కలెక్టర్ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులు మొదలు పెట్టాలని ఆయన కోరారు.

# సినిమా..


## సిద్ధూ..ఓ రొమాంటిక్ డ్రామా



కేజీఎఫ్ సినిమాతో హీరోయిన్‌గా బ్లాక్ బస్టర్ హిట్టందుకుంది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3లో కలిసి నటించింది. ఈ భామ ప్రస్తుతం సిద్దుజొన్నలగడ్డతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ తెలుసు కదా సినిమాలో నటించింది. ఈ సినిమా గురించి ఆసక్తికర విష యాలు షేర్ చేసుకుంది శ్రీనిధిశెట్టి. చిట్ చాట్ సెషన్‌లో శ్రీనిధి శెట్టి మాట్లాడు తూ.. కేజీఎఫ్, హిట్ 3లాంటి వయోలెన్స్, రక్తపాతం చుట్టూతిరిగే సినిమాల తర్వాత సున్నిత భావోద్వేగాలతో సాగే సినిమాఇది. ఈ మూవీనాకు ఉ త్తేజాన్ని కలిగించే మార్పు లాంటిది.


ఈ చిత్రాన్ని ప్రతీ ఒక్కరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నానంది. తెలుసు కదా ప్రేమ, ఎమోషన్, నవ్వులు, అందమైన పాటలతో సాగే కమర్షియల్ సినిమా. ఈ సినిమా చూసిన తర్వాత మూవీ లవర్స్ ఒక అందమైన రొమాంటిక్ డ్రామాను చూసినట్టు ఫీల్ అవుతారంది శ్రీనిధి శెట్టి.సినిమాకు పనిచేయడం గురించి మాట్లాడుతూ.. నాకు డైరెక్టర్ నీరజ కోన, సిద్ధు, రాశీ ఖన్నాతో కలిసి నటించే అద్భుతమైన సమయం దొరికింది. నీరజ కోన చాలా సపోర్ట్‌గా నిలిచే వ్యక్తి. ప్రేక్షకులు ఖచ్చితంగా సిద్ధు పాత్రతో ప్రేమలో పడిపోతారు. అతడికి ప్రతీ విభాగంలో అద్భుతమైన ప్రావీణ్యం ఉంది. రాశీఖన్నా చాలా క్రమశిక్షణతో ఉండే వ్యక్తి అని చెప్పుకొచ్చింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి పనిచేయడం గొప్పగా భావిస్తున్నాన ంది. సినిమాల పట్ల ఎంతో ప్యాషన్ ఉన్న నిర్మాతలతో కలిసి పని చేయడం అదృష్టంగా భావిస్తున్నానంది శ్రీనిధిశెట్టి.

## కొత్త ఇంట్లో గృహప్రవేశం చేసిన నటి సమంత




స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది. అనారోగ్యం నుంచి కోలుకుని కెరీర్‌లో దూసుకెళ్తున్న ఆమె, తాజాగా కొత్త ఇంట్లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా గృహప్రవేశ వేడుకను నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను తన అభిమానులతో పంచుకోగా, అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వేడుకలో సమంత ఎరుపు రంగు సంప్రదాయ వస్త్రాలు ధరించి ప్రత్యేక పూజలు చేశారు. పూజలో ఎంతో ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో పాల్గొన్న ఆమె ఫొటోలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. నుదుట కుంకుమతో ఉన్న ఆమె లుక్ నెట్టింట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'ఫొటో డంప్' అనే పేరుతో ఆమె పోస్ట్ చేసిన ఈ చిత్రాల్లో కొత్తింటి అందాలు, పూజా కార్యక్రమాలతో పాటు తన జిమ్ వర్కౌట్ క్లిప్స్‌ను కూడా జతచేశారు. కేవలం ఫొటోలను పంచుకోవడమే కాకుండా, సమంత తన జీవిత దృక్పథాన్ని తెలియజేస్తూ ఒక ఆసక్తికరమైన క్యాప్షన్‌ను కూడా రాసుకొచ్చారు. "నేను ఆలోచించేది, చెప్పేది, చేసేది ప్రతీది నా ఉ న్నతమైన స్వభావానికి గౌరవమిచ్చేలా ఉండాలి. ఇప్పుడు అదే నేర్చుకున్నాను, ఇకపైఅలానే చేయగలనని ఆశిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. ఈక్యాప్షన్ ఆమె అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. మయోసైటిస్ నుంచి కోలుకున్న తర్వాత సమంత కెరీర్‌లో కొత్త ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులను పలకరించిన ఆమె, నిర్మాతగా కూడా కొత్త అవతారం ఎత్తారు. 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పేరుతో సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించి, 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇదే బ్యానర్‌పై 'మా ఇంటి బంగారం' అనే చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. త్వరలో 'రక్త బ్రహ్మాండ్' అనే హిందీ వెబ్ సిరీస్‌లో కూడా ఆమె కనిపించనున్నారు. మొత్తంగాఈ కొత్త ఇల్లు ఆమె జీవితంలో సరికొత్త విజయాలకు నాంది పలుకుతోందని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.

## ఈగల్ నా ఫేవరెట్ సినిమా..: రవితేజ



మాస్ మహరాజా రవితేజ త్వరలో 'మాస్ జాతర' సినిమాతో రా బోతున్న సంగతి తెలిసిందే. అక్టోబర్ 31న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుండగా, ప్రమోషన్లలో బిజీగా ఉన్న రవితేజ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనకు ప్రత్యేకంగా నచ్చిన సినిమాల గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈగల్ నా ఫేవరెట్ సినిమా. అందులో నేను చేసిన పాత్ర నా కెరీర్‌లో నాకు అత్యంత ఇష్టమైన పాత్ర. కానీ జనాలకు మాత్రం నచ్చలేదు. మంచి ఐడియా ఉన్నా, స్క్రీన్ ప్లే కొంచెం క్లిష్టంగా ఉండటంతో వాళ్లు కన్ఫ్యూజన్ అయ్యారు. అదే కథను సింపుల్‌గా చెప్పి అంటే బాగా వర్కౌట్ అయ్యేది అని అన్నారు రవితేజ. ఇక తనకి ఇష్టమైన మరో సినిమా 'నా ఆటోగ్రాఫ్ మెమరీస్' గురించి కూడా చెప్పాడు. ఆ సినిమా నాకు చాలా ఇష్టం.చాలా హృద్యంగా ఉంటుంది. కానీ అది కూడా ఆడలేదు. అలానే 'నేనింతే' కూడా అప్పట్లో ఆడలేదు. కానీ ఇప్పుడు ఈ రెండూ క్లాసిక్స్‌గా గుర్తింపు పొందాయి అని తెలిపారు. ఇలాంటి మంచి సినిమాలు మొదట్లో ప్రేక్షకుల్ని ఆకట్టుకోకపోయినా, కాలక్రమేణా గొప్ప సినిమాలుగా గుర్తింపు పొందడాన్ని రవితేజ గుర్తుచేశారు. ఈగల్ కూడా ఓ రోజు క్లాసిక్‌గా మారవచ్చు అని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రస్తుతం రవితేజ 'మాస్ జాతర' సినిమాతో మళ్లీ మాస్ ఆడియన్స్‌ను మెప్పించేందుకు రెడీ అవుతున్నాడు. ట్రైలర్‌కు వచ్చిన స్పందన చూస్తుంటే, ఈసారి మాస్ మహారాజా పక్కా బ్లాక్‌బస్టర్ కోసం సెట్ అయ్యాడు అనిపిస్తుం ది. గత కొద్ది రోజులుగా రవితేజ వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులని పలకరిస్తూ వస్తున్నాడు. కాని ఎందుకో ఆయన చేసిన సినిమాలన్నీ కూడా బాక్సాఫీస్ దగ్గర నిరాశపరుస్తున్నాయి. ఇప్పుడు మాస్ జాతరపైన రవితేజ భారీ హోప్స్ పెట్టుకున్నాడు. ఈ సినిమా హిట్టైతే రవితేజ మళ్లీ ట్రాక్‌లో పడ్డట్టే అని చెప్పాలి. ఇక రవితేజ తన తదుపరి సినిమా గా కిషోర్ తిరుమల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు. ఈ మూవీ కూడా ప్రేక్షకులు మెచ్చే చిత్రంగా ఉంటుందని అంటున్నారు.

## కొట్టుమిట్టాడుతున్న మృణాల్..



హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది.పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు ఐదు సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానా యికగాఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులు తూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ,సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్‌దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బస్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది.

## ఫరియా అందాల ఆరబోత



జాతిరత్నాలు సినిమాలో చిట్టి పాత్రలో నటించి, తన అమాయకత్వంతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఫరియా అబ్దుల్లా. ముఖ్యంగా తన నటనతో మెప్పించడమే కాకుండా తన హైట్ తో అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రభాస్, మహేష్ బాబు లాంటి దిగ్గజ హీరోలు కూడా ఈమె హైట్ చూసి ఆశ్చర్యపోయారు అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా మంచి కటౌట్ ఉన్నప్పటికీ హైట్ కారణంగా ఈమె అవకాశాలు కోల్పోతోందనే వార్తలు ఎప్పటికప్పుడు వినిపిస్తూనే ఉన్నాయి. అటు కొరియోగ్రాఫర్ గా కూడా పేరు సొంతం చేసుకున్న ఫరియా అబ్దుల్లా.. హీరోయిన్ గా కంటే అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి హీరోల సినిమాలకు కొరియోగ్రఫీ అందించడంలోనే తనకు అసలైన ఆనందం అంటూ ఇటీవల ఒక షో వేదికగా తెలిపింది. ప్రస్తుతం సినిమాలలో అవకా శాలు లేక డాన్స్ షోలకి జడ్జిగా వ్యవహ రిస్తున్న ఈమె.. కెరియర్ ముందుకు సాగాలి అంటే అవకాశాలు రావాలని గ్రహించిందో ఏమో తెలియదు కానీ అందులో భాగంగానే ఇన్స్టాగ్రామ్ వేదికదా తెగ సందడి చేస్తూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. తాజాగా బ్లాక్ అవుట్ ఫిట్ లో దర్శనమిచ్చిన ఈమె అక్కడ అందాల ఆరబోత చేస్తూ యువ తను ఉక్కిరిబిక్కిరిచేసింది. ఎద అందాలతో పాటు థైస్ అందాలను ఎలివేట్ చేస్తూ ఫోటోలకు ఫోజులు ఇచ్చిన తీరు ఫాలోవర్స్ కు చెమటలు పట్టిస్తోంది.ముఖ్యంగా ఈమె ఫోటోలు చూసిన నెటిజన్స్ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తు న్నారు. చిట్టి రోజు రోజుకూ మరింత హాట్ గా తయా రవుతోందని ఒక నెటిజన్ కామెం ట్ చేస్తే.. మరొక నెటిజన్ ఈ అందాన్ని తట్టుకోవడం కష్టమే అంటూ కామెంట్ చేశారు. ఇంకొక నెటిజన్ భిన్నంగా స్పందిస్తూ.. నేరుగా హా లీవుడ్ కి వెళ్లి అక్కడ సినిమాలు ట్రై చేయండి. దారితప్పి సౌత్ సినిమా లలోకి వచ్చారు అంటూ కామెంట్ చేశారు.. ఇలా ఎవరికి వారు తమ అ భిప్రాయాలను పంచుకోవడం విశేషం. ఫరి యా అబ్దుల్లా అలియాస్ చిట్టి విషయానికి వస్తే.. 1997 జూన్ 21న హైదరాబాదు లోని బం జారాహిల్స్ లో జన్మించింది. ఈమె తండ్రి పేరు సంజయ్ సుల్తానా, తల్లి పేరు కౌసర్ సుల్తానా.. హైద రాబాదులోని మెరిడియా న్ అండ్ భవన్స్ లో పదవ తరగతి వరకు చదువుకున్న ఈమె.. ఆ తర్వాత లయోలా కాలేజీలో మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేసింది.

## పాజిటివ్ ఎనర్జీ ఇచ్చిన నెగిటివ్ రోల్

టాలీవుడ్‌లో మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా వస్తున్న విజువల్ వండర్ విశ్వంభర సినిమా పట్ల అభిమానుల్లో, సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. సోషియో ఫాంటసీ జోనర్‌లో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌ని యంగ్ డైరెక్టర్ వశిష్ట తెరకెక్కిస్తు ండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. మెగా స్టార్ సరసన త్రిష ప్రధాన కథానాయికగా కనిపించనుండగా, కన్నడ బ్యూటీ ఆశికా రంగనాథ్, కునాల్ కపూర్, ఇతరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాజిటివ్ ఎనర్జీ ఇచ్చిన నెగిటివ్ రోల్ ఇప్పుడు చిత్ర బృందం ఆశికా రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది.

ఈ పోస్టర్‌లో ఆశికా రంగనాథ్ సంప్రదాయ దుస్తుల్లో, చందమామ లాంటి మెరుపుతో అందంగా కనిపించారు. నెక్లెస్ చేతికి గాజులు, నుదుటి బొట్టు.. మొత్తం లుక్ ఆకర్షణీయంగా, కలర్‌ఫుల్‌గా ఉండటంతో ఈ క్యారెక్ట ర్‌పై ఇంట్రెస్ట్ పెరిగింది. ఆమె గ్లామర్ యాంగిల్‌ని హైలైట్ చేస్తూ రూపొందించిన పోస్టర్‌కు సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ వస్తోంది. మెగా ఫ్యాన్స్ తో పాటు సాధారణ ఆడియన్స్ కూడా ఆశికా కొత్త లుక్‌పై పాజిటివ్ కామెంట్లు చేస్తున్నారు.



Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. rni. no: TELTEL/2023/88215